Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 02.08.2019, శుక్రవారం | సంపుటి : 39 సంచిక : 09 | పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## కొండంత భారం...

# గుండె నిండా ధైర్యం



- మొండిచేయి చూపుతున్న కేంద్రం
- నిధుల లేమితో రాష్ట్రం
- హామీలపై వెనక్కి తగ్గని జగన్
- సరికొత్త మార్పులతో పాలన
- ఏళ్ళ తరబడి చర్చలకే పరిమితమైన అంశాలకు చట్ట రూపం

***రెండు నెలల కాలంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.యస్.జగన్మోహన్‌రెడ్డి అమలులోకి తీసుకొస్తున్న కార్యక్రమాలను చూస్తుంటే ఎవరికైనా ఆశ్చర్యమేస్తుంది. ఆయనది గుండె లేక బండ అనే అనుమాన మొస్తుంది. ఎందుకంటే ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వున్న దుర్భర పరిస్థితుల్లో ఆయనలాగా నిర్ణయాలు తీసుకోవాలంటే మహామహులకే సాధ్యం కాదు. అంత ధైర్యం చేయలేరు కూడా!***

గత రెండు నెలల పాలనాకాలంలో ఆయన చేసిన ప్రతి కార్యక్రమం కూడా సాహసంతో కూడుకున్నదే! ఎందుకంటే రాష్ట్రంలో నిధులు లేవు. కేంద్రం నుండి సహకారం లేదు. మరి జగన్ అమలులోకి తెస్తున్న కార్యక్రమాలు చూస్తేనా... ఆశా వర్కర్‌లు, అంగన్‌వాడీలు, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు పెంచడం, ఉద్యోగులకు ఐఆర్ పెంచడం, ఈపిఎస్‌ను రద్దు చేయడం, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రతిపాదన, అమ్మ ఒడి పథకం, ఆరోగ్యశ్రీని విస్తరించడం, పింఛన్‌లు పెంచడం, ఆటో కార్మికులకు, (మిగతా 11వ పేజీలో)

## ఉత్తమనేత కన్నుమూత



**కేంద్రమంత్రిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దేశానికి అత్యున్నత సేవలు అందించిన మహానేత.. జైపాల్‌రెడ్డి ఇక లేరు** 11లో

## మెగా బ్రదర్స్‌కు...

# బీజేపీ వల?



- రాష్ట్ర బాధ్యతలు అప్పగించే యోచన
- జమిలి నేపథ్యంలో దూకుడు పెంచిన బీజేపీ

*దక్షిణ భారతదేశంలో కర్నాటకలో పాగా వేసిన బీజేపీ, ఆ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలపై కూడా కన్నేసిందన్నది జగమెరిగిన సత్యం. తెలంగాణలో నిన్నటి లోక్‌సభ ఎన్నికల ఫలితాలతోనే ఆ పార్టీ నాయకులలో ఎక్కడలేని ఆశలు పెరిగాయి. 8 నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒక్కటంటే ఒక్క అసెంబ్లీనే గెలుచుకోగా, ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఏకంగా నాలుగు లోక్‌సభ స్థానాలను గెలుచుకోగలిగింది. ఇక్కడే కాంగ్రెస్‌ను దాటిపోయింది. రాబోయే ఎన్నికల్లో కాలానికి తెలంగాణలో అధికారంలోకి రావాలన్నది వారి ప్రణాళిక! ఒకవేళ అది మిస్సయితే ప్రతిపక్షంగానైనా బలపడాలన్నది వారి భవిష్యత్ వ్యూహం.*

ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ అంటేనే జనం మండి పడుతున్నారు. విభజన హామీలు అమలు చేయకపోవడంతో ఏపి ప్రజలకు ఆ పార్టీ అంటే మండుతోంది. ఇంతటి వ్యతిరేకత వుండే ఏపిలోనూ చాపక్రింద నీరులా చొచ్చుకుపోవాలని పావులు కదుపుతున్నారు. ఏపిలో వారి వ్యూహరచన అమలు ఎలా వుంటుందంటే... ముందు ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీని బలహీన పరచడం, (మిగతా 11వ పేజీలో)

## ఉత్తరక్రియలు



కీ.శే. తుంగా రాజగోపాలరెడ్డి గారు



జననం 16.10.1930 | మరణం 20.07.2019

మా అమ్మ

**శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారి**

పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

**తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు)**

లాయర్ వారపత్రిక

**ఉత్తరక్రియలు**

**తే.03.08.2019ది శనివారం ఉదయం 11గంటలకు నెల్లూరు మాగుంట లే అవుట్, 2వ మెయిన్, 2వ క్రాస్‌లోని మా స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.**



నిర్వాహకుల సత్కారాన్నందుకుంటున్న అవధాని మురళీకృష్ణ

# ఆకట్టుకున్న మురళీకృష్ణ అష్టావధానం

నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ సీతారామస్వామి మందిరంలో జూలై 28న ప్రముఖ అవధాని కొండపి మురళీకృష్ణ నిర్వహించిన అష్టావధానం కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. మురళీకృష్ణ నెల్లూరు ఎల్ఐసిలో పనిచేస్తున్నా అవధానిగా రాష్ట్రవ్యాప్త ఖ్యాతి చెందారు. శతావధానిగా కూడా ఆయనకు మంచి పేరుప్రఖ్యాతులున్నాయి. పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవధానం కార్యక్రమంలో మురళీకృష్ణ తేటతెలుగు పద్యాలను సందర్భోచితంగా చమత్కారంగా కూడా వర్ణించి అందరి కరతాళధ్వనులను అందుకున్నారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ కార్యక్రమంలో పృచ్ఛకులుగా విద్వాన్ అగస్త్యరాజు సుబ్బారావు, ఊరుబిండి వేంకట సుబ్రహ్మణ్యం, విద్వాన్ సూరం చంద్రశేఖరం, డా.ఐనవోలు శ్రీనివాస చక్రపాణి, పోలవరపు లక్ష్మీనరసింహారావు, అవధాని కోట రాజశేఖర్, శ్రీమతి కె.విజయలక్ష్మి, డా.సూరం శ్రీనివాసులు పాల్గొన్నారు. పోలవరపు లక్ష్మీనరసింహారావు సభాధ్యక్షులుగా వ్యవహరించగా, సభాపోషకులు ముప్పిరాల సుబ్రహ్మణ్యం, సారస్వతవేత్త డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు, ఆలయకమిటీ అధ్యక్షుడు వేంకటేశ్వరగుప్తా తదితరులు పాల్గొన్నారు.

# వింజమూరు ఏం పాపం చేసిందో?

## • మున్సిపాల్టీ యోగం లేదా?

**రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన మున్సిపాల్టీలలో నెల్లూరుజిల్లా నుండి బుచ్చిరెడ్డిపాలెం, అల్లూరు, తడ, ముత్తుకూరు, రాపూరు, పొదలకూరు, కోట, వాకాడులకు స్థానం దక్కడం తెలిసిందే! గత తెలుగుదేశం ప్రభుత్వంలోనూ ఈ మేజర్ పంచాయితీలను మున్సిపాల్టీలుగా మార్చాలని ప్రతిపాదనలు రూపొందించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు.**

అయితే కొత్తగా అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కొత్త మున్సిపాల్టీల ఏర్పాటుపై వేగవంతమైన నిర్ణయం తీసుకుంది. ప్రతిపాదనలకే పరిమితమైవున్న మేజర్ పంచాయితీలు కొన్ని మున్సిపాల్టీలుగా మారబోతున్నాయి. అయితే తెలుగుదేశం ప్రభుత్వంలోనే మున్సిపాల్టీగా మార్చాలని ప్రతిపాదించిన వింజమూరు మేజర్ పంచాయితీకి ఈ జాబితాలో స్థానం దక్కక పోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఉదయగిరి నియోజకవర్గంలోనే వింజమూరు పట్టణం పెద్దది. 30వేలకు పైనే జనాభా వుంది. దీనిని 9 ఊర్ల పంచాయితీగా కూడా చెప్పుకుంటారు. పట్టణాన్ని ఆనుకుని వున్న గ్రామాలను కలిపినా జనాభా 40వేలు దాటుతుంది. విద్యా, వైద్య వసతుల పరంగాను, వ్యాపార పరంగానూ అభివృద్ధి చెందిన పట్టణం. ఈ చుట్టుపక్కల మండల కేంద్రాలలోనూ, గ్రామాలలోనూ పనిచేసే ఉద్యోగులు, వ్యాపారులు ఎక్కువుగా వింజమూరులోనే స్థిరపడుతుంటారు. రియల్ ఎస్టేట్ పరంగా చూసినా వింజమూరుకు తూర్పు, పడమరల పక్క అటు ఇటు రెండు, మూడు కిలోమీటర్లలోనే లే అవుట్లు వేసివున్నారు. స్థలాల ధరల్లోనూ వింజమూరు నెల్లూరుతో పోటీ పడుతుంటుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ నిర్వహణలోనూ బెస్ట్ పంచాయితీ అవార్డ్ అందుకున్న ఊరిది. ఇలాంటి ఊరిని కొత్త మున్సిపాల్టీల లిస్టులో చేర్చకపోవడంపై స్థానికులు నిరాశతో ఉన్నారు.



# కుళ్ళు మాంసంతో.. ఒళ్ళు గుల్ల

- గబ్బుకొడుతున్న చికెన్‌తోనే వంటలు
- పురుగులు పట్టిన రొయ్యలతోనే వేపుళ్ళు
- వేడివేడిగా వడ్డిస్తున్న హోటళ్లు

***నెల్లూరు హోటళ్ళంటే ఒకప్పుడు భలే మంచిపేరుండేది. ఇటీవలి కాలంలో అదికూడా మట్టి కొట్టుకుపోతోంది. కల్తీవ్యాపారం జోరు పెరిగిపోయి కాసులకోసం కక్కుర్తిపడుతూ జనం ఆరోగ్యాన్ని అందుకు పణంగా పెడుతున్నారు. కుళ్ళిపోయి మురుగు గబ్బుకొడుతున్న మాంసం..పురుగులు పట్టిపోయి ఉన్న రొయ్యలు, కుళ్ళిపోయిన కూరగాయలతో వంటలు వండి జనం ఆరోగ్యాన్ని సర్వనాశనం చేస్తున్న వైనం ఇటీవల అధికారుల తనిఖీల్లో భారీస్థాయిలో బయటపడుతుండడంతో ఆ హోటళ్ళకు వెళ్ళాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు. కొన్నిహోటళ్ళలోనైతే.. ఎన్ని రోజుల్నించి నిల్వ ఉంచారో ఆ మాంసాన్ని.. కుళ్ళిపోయి.. పురుగులు పట్టి మురుగుగబ్బు కొడుతోంది. ఫ్రిజ్‌లలో మురుగుతున్న ఆ మాంసంతోనే బిర్యానీలని, తండూరీ చికెన్ అనీ రకరకాల పేర్లు పెట్టి వేడివేడిగా జనానికి వండి వడ్డించేస్తున్నారు. తినే ఆహారాన్ని కల్తీ చేయకూడదనే ఇంగితజ్ఞానం కూడా లేకుండా ఆ పాపపు సొమ్ముతోనే కల్తీవ్యాపారులు తమ జేబులు నింపుకుంటూ కోట్లు గడిస్తున్నారు.***



ఓ హోటల్‌లో కుళ్లిన మాంసాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

దేనికైనా హద్దుంటుంది కానీ. కల్తీకి మాత్రం ఉండడం లేదు. నెల్లూరు నగరమైతే కల్తీకి మారుపేరుగా మారిపోయింది. ఇక్కడ ప్రతి వస్తువూ కల్తీయే. చివరికి డబ్బులు పోయినా పర్వాలేదు కానీ రుచిగా ఉంటుంది కదా అని బిర్యానీ తినడానికి వెళ్ళినా.. అక్కడ కూడా కల్తీయే. తినే ఆహారపదార్థాల్లో భారీగా కల్తీ చేసి జేబులు నింపుకునేందుకు అలవాటు పడిపోయిన కొందరు కల్తీవ్యాపారులు ప్రతిదాంట్లో కల్తీ చేస్తూ..అమాయక జనాన్ని మోసం చేస్తూ కోట్లు కూడబెట్టుకుంటున్నారు. కనీసం మానవత్వమనేది కూడా లేకుండా కుళ్ళిన మాంసాన్ని కూడా బిర్యానీలో కలిపేసి జనానికి పెట్టేస్తున్నారు. చికెనైతేనేం.. మటనైతేనేం.. ఒక బిరియానీ ధర వందల్లోనే ఉంటుంది. అంత డబ్బులిచ్చి మరీ ఈ కుళ్ళిపోయి.. పురుగులుపట్టిన మాంసపు బిరియానీలు తినాల్సిన దుర్గతి. ఎంత బాధాకరం?.. నెల్లూరులోని మద్రాసుబస్టాండు వద్ద ఉన్న ఒక బిరియానీ దర్బార్ హోటల్‌లో నగరపాలకసంస్థ అధికారులు జూలై 26న ఆకస్మికంగా తనిఖీలు చేసినప్పుడు అక్కడి ఫ్రిజ్‌లలో భారీగా ఉన్న కుళ్ళిన మాంసాన్ని చూసి అవాక్కయిపోయారు. అలా నిల్వ ఉంచి మురుగుడు పట్టిన మాంసం, ఆహార పదార్థాలతో వంటలు చేస్తూ.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న పలు హోటళ్ళు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహ కుల దారుణ మోసాలను చూసి జనం కూడా బెంబేలెత్తిపోతున్నారు.

### 300 కేజీలకు పైగానే కుళ్ళిన మాంసం పట్టివేత :

కుళ్ళిన మాంసాన్ని, పురుగులుపట్టిన రొయ్యల్ని వేడిగా వేయించి, ఉప్పు కారం మసాలా వేసి బిరియానీల్లో కలిపేస్తే ఎవరూ కనుక్కోలేరని కొంతమంది మోసపు వ్యాపారులు ఇలాంటి పాపాలకి ఒడిగడుతున్నారు. ఎంతకాలం నుంచి ఇలాంటి కల్తీవ్యాపారాలు చేస్తున్నారో తెలియదు. బయటకు మాత్రం ఈ హోటళ్లు భలే ఆకర్షణీయంగా ఉంటాయి. లోపలికొస్తే మాత్రం ఆరోగ్యం గుల్ల. నగరపాలక సంస్థ కమిషనర్ పివివిఎస్ మూర్తి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌లు కలసి పలు హోటళ్ళు రెస్టారెంట్లలో ఈ తనిఖీలు చేస్తే కుళ్ళిన మాంసం వండిపెడుతున్న వ్యాపారుల బండారం బయటపడింది. ఒక్క హోటల్‌లోనే కాదు, మరో రెండుమూడు హోటళ్ళలో కూడా ఇదే తంతు జరుగుతూ ఉండడాన్ని అధికారులు గుర్తించి.. ఆ హోటళ్ళ బండారాన్ని కూడా వారు బయటపెట్టారు. రోజుల తరబడి నిల్వ చేసిన మాంసాన్ని, కుళ్లిపోయి పురుగులు పట్టిన మాంసాన్ని దాదాపుగా 300 కేజీలకు పైగానే ఆయా హోటళ్ళలో అధికారులు స్వాధీనం చేసుకున్నారంటే, ఆ హోటళ్ళలో జరిగే మోసం, కల్తీ ఎంత భారీస్థాయిలో ఉంటోందో తెలుసుకోవచ్చు.

### మందుబాబుల నెత్తిన కుచ్చుటోపీ

కొన్ని బార్ అండ్ రెస్టారెంట్‌లలో కూడా ఎంతోకాలంగా ఇలాంటి కల్తీ మాయాజాలమే జరుగుతోంది. మందుబాబులు మత్తులో జోగుతుంటారు కనుక అసలు ఇబ్బందే లేదు. వారికి కూడా చచ్చిన కోళ్ళు, కుళ్ళిపోయిన మాంసం వేడివేడిగా వడ్డించి, ఆ కల్తీ వంటకాలకు కూడా తమ ఇష్టానుసారం రేట్లు పెంచి వారి నెత్తిన కుచ్చుటోపీ పెడుతున్నారు. ఇంత సులభంగా డబ్బు సంపాదించే మార్గం ఇంతకన్నా ఏముంటుంది?.. ప్రజల ఆరోగ్యం ఏమైపోతేనేం.. డబ్బు సంపాదనే ముఖ్యం అనుకునే ఇలాంటి కక్కుర్తి..కల్తీవ్యాపారులు ఒక్క నగరంలోనే కాదు... జిల్లావ్యాప్తంగా ఇంకెంతమంది ఉన్నారో.. ఆ దేవుడికే తెలియాలి.

### నిబంధనలు పట్టించుకునేవారే లేరు:

ఆహార నియంత్రణ పరిరక్షణ చట్టం కింద ఎన్నో నియమ నిబంధనలున్నా హోటళ్ళు, రెస్టారెంట్ల వారు, కల్తీవ్యాపారాలు చేసేవారు అసలు పట్టించుకోవడం లేదు. కానీ, అడిగేవారు లేరని ఎంతోమంది కల్తీవ్యాపారులు ఈ అక్రమవ్యాపారాలకు పాల్పడుతున్నారు. తినే ఆహారాన్ని కూడా కల్తీచేసి, ప్రజల ఆరోగ్యాన్ని చెడగొడుతున్న ఇలాంట నికృష్ట వ్యాపారులకు ఎంత జరిమానా విధించినా లాభం లేదు. నెల తిరిగే సరికి జనం డబ్బును లక్షల్లో కొల్ల గొట్టే కల్తీవ్యాపారులు ఎంత జరిమానా వేసినా జంకరు. అంతకు పదింతలు మళ్ళీ ఒక్కరోజులోనే జనంమీదపడి సంపాదిస్తా మనే ధీమా వారిలో ఉంటుంది.

జనానికి కలుషితమైన ఆహారం పెడుతున్న ఈ రకం కల్తీ వ్యాపారులకు జరిమానాలతో పాటు కఠినశిక్షలు ఉంటే తప్ప.. ఇలాంటి మోసపు వ్యాపారాలను అరికట్టడం అసాధ్యం!....

# ఎర్రచందనం పట్టివేత

బొప్పాయి కాయల మాటున ఎర్రచందనం తరలిస్తుండగా వాహనంతో సహా ఐదుగురు వ్యక్తులను, దుంగలను నెల్లూరు జిల్లా ఆత్మకూరు సర్కిల్ పరిధిలో సోమశిల మర్రిపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జూలై 27న సీఐ బీ పాపారావు స్థానిక పోలీస్‌స్టేషన్లో విలేఖర్లకు వివరాలను వెల్లడించారు. సోమశిల ఎస్సై నాగశిరీష, మర్రిపాడు ఎస్సై శివరాకేష్ వాహనాలను తనిఖీ చేస్తుండగా తెల్లవారు జామున అనంతసాగరం మండలం యాకర్లపాడు సమీపంలో అటవీ ప్రాంతంలో ఓ వాహనంలో బొప్పాయి కాయల లోడు కింద ఏడు ఎర్రచందనం దుంగలను తరలిస్తుండగా పట్టుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.5 లక్షలు ఉంటుంది. వాహనంతో పాటు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 70 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సోమశిల ఎస్సై నాగశిరీష, మర్రిపాడు ఎస్సై శివరాకేష్‌లకు అవార్డులు ఇప్పించేందుకు సిఫారసు చేస్తున్నట్లు సీఐ పాపారావు తెలిపారు.

## పెంచలకోన హుండీల ఆదాయం

# రూ. 84.30లక్షలు

నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెంచలకోనలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెనుశిల లక్ష్మీ నరశింహస్వామి దేవస్థానంలోని హుండీలను గతనెల 30న లెక్కించారు. 2019 మే19వ తేదీ నుండి గత నెల30 వరకు పెనుశిల లక్ష్మీ నరశింహస్వామి, ఆదిలక్ష్మీ దేవి, ఆంజనేయస్వామి మూడు దేవస్థానాల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.84,30,653లు ఆదాయం లభించిందని, అమెరికా డాలర్లు 27, సౌదీ రియాల్స్ 25, కువైట్ దినార్లు 3 వచ్చినట్లు దేవదాయశాఖ సహాయ కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఏసీ వెంకటసుబ్బయ్య తెలిపారు.

## విలువల దిగ్గజం..
# ఆనం భక్తవత్సలరెడ్డి ఇక లేరు



విలువలు కలిగిన రాజకీయాలకు నిలువెత్తు రూపం, నమ్ముకున్న వారిని వెన్నుతట్టి ముందుకు నడిపించే రాజకీయ దిగ్గజం ఆనం భక్తవత్సలరెడ్డి జూలై 26వ తేదీ రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన వయసు 90సంవత్సరాలు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె వున్నారు. పెద్దకొడుకు ఆనం వెంకటరమణారెడ్డి జిల్లా రాజకీయాలలో తనదైన శైలిలో కొనసాగుతున్నారు. కుమార్తె తనూజరెడ్డి చెన్నైలో ప్రఖ్యాత చర్మవ్యాధుల వైద్యనిపుణురాలిగా ప్రసిద్ధిగాంచగా, అల్లుడు చెన్నై విజయ ఆసుపత్రిలో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ సి.రాజశేఖర్‌రెడ్డి అందరికీ సుపరిచితుడే!

రాష్ట్ర రాజకీయాలలోనే తనదైన ముద్రను వేసుకుని, నెల్లూరుజిల్లా రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన స్వర్గీయ ఏ.సి.సుబ్బారెడ్డికి అసలైన రాజకీయ వారసుడు, ఆయన రెండో కుమారుడు ఆనం భక్తవత్సలరెడ్డే! 1929లో ఏ.సి సుబ్బారెడ్డి రెండవ సంతానంగా జన్మించిన ఆయన జిల్లా రాజకీయాలలో తనదైన పాత్రను పోషించారు. ఇందుకూరుపేట సమితి అధ్యక్షుడిగా రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలవడమేకాక ఈ సమితి నుండి హ్యాట్రిక్ విజయాలు సాధించారు. నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడిగా పనిచేసి సహకార రంగంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. జిల్లా రైతాంగానికి అనేక విధాలుగా సేవలందించారు. నెల్లూరులోని విఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. ముఖ్యంగా తన తండ్రి ఏ.సి.సుబ్బారెడ్డి మరణం తర్వాత చిన్నాన్న స్వర్గీయ ఆనం వెంకటరెడ్డి నాయకత్వంలో జిల్లాలో రాజకీయంగా ఆనం వర్గం ప్రాబల్యం పెంచడానికి తనవంతు కృషి చేశారు. ఎవరు వచ్చి తమ సమస్యను చెప్పుకున్నా మంచి మనసుతో ఆ పని చేసిపెట్టి పంపించే గుణమున్న నాయకుడు. ఆయన స్వగ్రామం సౌత్‌రాజుపాలెం వాసులకు ఆయనంటే ఎంతో అభిమానం. ఇంతకాలం తమకు మంచి చెడ్డ చెప్పే పెద్దదిక్కును కోల్పోయామని ఆ గ్రామస్తులు విషాదంలో వున్నారు. ఆనం భక్తవత్సలరెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ... వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# అక్రమ అవయవ వ్యాపారాలను అడ్డుకోండి
## - రాజ్యసభలో విపిఆర్



దేశంలో అక్రమ అవయవ వ్యాపారాలను ఆపడానికి కేంద్రప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని బుధవారం రాజ్యసభలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. చట్ట విరుద్ధమైన అవయవ వ్యాపారాన్ని ఆపడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నప్పటికీ ఇది కొనసాగుతూనే వుందన్నారు. ప్రపంచ అగ్రదేశాల్లో భారతదేశం ఒకటిగా వున్నప్పటికీ కిడ్నీ, కాలేయం, గుండె వంటి అవయవాలు ఎవరైనా కొనుగోలు చేసే విధంగా ఉందని, ముఖ్యంగా మూత్రపిండాలు మరియు కాలేయం డిమాండ్ ఎక్కువగా వున్నందున పేదప్రజలను నిలువునా ప్రలోభాలకు గురిచేస్తూ మోసం చేస్తున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎక్కువ మోతాదులో నగదు ఆశచూపడం ద్వారా పేదల అవయవాలను సేకరిస్తున్నారన్నారు. ఈ పరిస్థితి దేశంలో ప్రతి రాష్ట్రంలో మరీ ముఖ్యంగా ఢిల్లీలోనూ ఎక్కువగా వుందన్నారు. ఈ అవయవాల వ్యాపార దందాలో ఆసుపత్రుల యాజమాన్యాలు, మెడికల్ స్టాఫ్ సహకారం, మధ్యవర్తుల పాత్ర ఎక్కువగా వుంటుందన్నారు. పాశ్చాత్య దేశాలతో పోల్చి చూస్తే, మన దేశంలో చాలా తక్కువ ధరకు ఉత్తమ చికిత్స లభిస్తున్నందువల్ల విదేశీయులు సైతం ఇక్కడకు వస్తున్నారన్నారు. భారతదేశంలో 2లక్షల కిడ్నీలు అవసరం కాగా, 6వేలు అందుబాటులో వున్నాయని, 30వేల కాలేయాలు అవసరం కాగా, 1500 అందుబాటులో వున్నాయని, 50వేల గుండెలకు 1500 అందుబాటులో వున్నాయని వివరించారు. మానవ అవయవ వ్యాపారాలు చేసే నేరస్తులపై కఠిన శిక్షలు విధించే విధంగా చట్ట సవరణ చేయాలని ఆయన సభలో డిమాండ్ చేశారు.

# ఉగాదికి 25లక్షల ఇళ్ళపట్టాలు
## - మంత్రి డా.అనిల్



హౌస్ ఫర్ ఆల్ ఇళ్ళను పరిశీలిస్తున్న మంత్రి అనిల్

వచ్చే ఉగాదికల్లా రాష్ట్రంలో ఒకేసారి పాతిక లక్షల కుటుంబాలకు ఇళ్ళ పట్టాలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి డా.పి. అనిల్‌కుమార్ చెప్పారు. జూలై 31న నెల్లూరులోని 54వ డివిజన్ జనార్ధన్‌రెడ్డికాలనీలో నిర్మించిన హౌస్‌ఫర్ ఆల్ ఆపార్ట్‌మెంట్లను మంత్రి అధికారులతో కలసి పరిశీలించారు. ఆ తర్వాత భగత్‌సింగ్‌కాలనీలో పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్మించిన హౌస్ ఫర్ ఆల్ ఇళ్ళకు సంబంధించి చదరపు అడుగుకు 1300 రూపాయలకు బదులుగా 2 వేల రూపాయలు ఖర్చయ్యాయని, టిడిపి ప్రభుత్వం పేదలపై అదనంగా భారం మోపిందని విమర్శించారు. ఆ అదనపు భారాన్ని తొలగించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ప్రతినెలా 2500 రూపాయలు బ్యాంక్‌లకు చెల్లించాలంటే పేదలకు చాలాకష్టమని, అందువల్ల పేదలందరికీ పూర్తిగా ఉచితంగా ఇళ్ళను ఇవ్వాలనేది జగన్మోహన్‌రెడ్డి ఆలోచనని తెలిపారు.

ముక్కాల ద్వారకానాథ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, దేవరకొండ అశోక్, ముజీర్, జమీర్, ఆర్.జెస్సీ, షేక్ మస్తాన్, ఖయ్యూం, అన్వర్, డి.ప్రకాష్, వెంకట రమణ, సుభాషిణి, సుధాకర్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## 'అమ్మ' లాంటి నమ్మకంతో...
# అందరి ఆదరణ పొందాం!
## - అమ్మ ఫర్నీచర్ మాల్ అధినేతలు



అమ్మలాంటి నమ్మకమే ఖాతాదారులలో తమ సంస్థ పట్ల ఆదరణ పెంచిందని, 20ఏళ్లుగా ఆ నమ్మకమే తమ సంస్థను ముందుకు నడిపిందని అమ్మ ఫర్నీచర్ మాల్ అధినేత గడ్డం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులో ఫర్నీచర్ కొనాలంటే ఎవరికైనా ముందుగా గుర్తొచ్చేది 'అమ్మ ఫర్నీచర్ మాల్'. 20ఏళ్ల క్రితం పాత ఫర్నీచర్ ఆక్షన్‌హాల్‌గా మొదలైన ఈ సంస్థ పూర్తి నమ్మకంతో, సరసమైన ధరలతో ఖాతాదారుల ఆదరాభిమానాలను పొందింది. ఆక్షన్ హాల్ ఇప్పుడు రెండు ఫర్నీచర్ మాల్స్ స్థాయికి విస్తరించింది. ఈ సందర్భంగా ఇటీవల అమ్మ ఫర్నీచర్ మాల్ 20వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ శుభసమయంలో మాల్ వ్యవస్థాపకులు గడ్డం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ఉన్నతికి కారణమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. నెల్లూరీయులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఆధునిక ఫర్నీచర్‌ను సాధారణ ధరలలోనే అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. వ్యాపారంలో లాభం కంటే తాము నమ్మకానికే అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. తమ సంస్థ పురోభివృద్ధికి అహర్నిశలు శ్రమ పడుతున్న తన కుమారులు సుమన్‌రెడ్డి, సుజన్‌రెడ్డిలను, సిబ్బందిని ఆయన అభినందించారు.




శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారు

జననం : 16.10.1930 మరణం : 20.07.2019

భువి నుండి దివికేగిన పుణ్యమూర్తికి మా నివాళి...

PRAVARSH TECH INDUSTRIES PVT. LTD.
HYDERABAD

## 'ప్రభా'తం

# ప్రజాస్వామ్యానికి అనారోగ్యం



ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు పడిపోతుంటాయి, ఏర్పడుతుంటాయి. అయితే విలువలతో ప్రభుత్వాలను ఏర్పాటు చేయడమన్నదే ప్రధాన అంశం. ఇప్పుడు కర్నాటకలో ఏర్పడ్డ బీజేపీ ప్రభుత్వ పునాదులు కూడా విలువల పరంగా బలహీనమే! యడ్యూరప్పది పూర్తి మెజార్టీతో ఏర్పడ్డ ప్రభుత్వం కాదు. ప్రజాస్వామ్య కోణంలో చూస్తే ప్రజాతీర్పును కాలరాసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారనే చెప్పాలి. ఇలాంటి రాజకీయ నికృష్టాలే ప్రజాస్వామ్య వ్యవస్థకు పెద్ద అంటురోగంగా మారుతున్నాయి.

ప్రపంచంలోనే భారత ప్రజాస్వామ్య వ్యవస్థ చాలా పెద్దది. అగ్రరాజ్యం అమెరికాన్నా కూడా మన ప్రజస్వామ్యమే గొప్పది. జనాభాలో పెద్ద దేశమైన చైనా కమ్యూనిస్టు దేశం కాబట్టి ప్రజాస్వామ్యపరమైన నెంబర్‌వన్ ర్యాంకు మనదేననుకోవచ్చు.

అయితే ఇంతపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో మనకు ఎన్నో లోపాలు కనిపిస్తాయి. ఈ లోపాలే ప్రజాస్వామ్య వ్యవస్థ పనితనాన్ని ప్రశ్నిస్తాయి. ఈ వ్యవస్థలో లొసుగులు ఎలా వుంటాయంటే, 200 సీట్లు వచ్చిన పార్టీ ప్రతిపాదించిన నాయకుడు ప్రధాని కాలేడు... పది సీట్లు వచ్చిన పార్టీ నాయకుడు 543 లోక్‌సభ స్థానాలున్న పార్లమెంటుకు నాయకుడవుతాడు. ఒక్కోసారి పూర్తి మెజార్టీతో గద్దెనెక్కిన ప్రభుత్వాలను రాజకీయ కుట్రలతో కుప్పకూలుస్తుంటారు. ఒక పార్టీ గుర్తు మీద పోటీ చేసి గెలిచిన ప్రజా ప్రతినిధులు ఏడాది తిరక్కముందే పార్టీ జెండాలు మార్చేస్తారు. పదవుల కోసం అధికారపార్టీలోకి పరుగులు పెడుతుంటారు.

ప్రస్తుతం కర్నాటక రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాలన్నీ కూడా ప్రజాస్వామ్య విలువలను పతనావస్థకు చేర్చే విధంగానే వున్నాయి. రాజకీయ విలువలకు పాడెకట్టి పాతిపెట్టడంలో ఇక్కడవున్న మూడు ప్రధాన పార్టీలు కూడా ముఖ్యభూమిక పోషించాయి.

కర్నాటకలో కాంగ్రెస్ - జెడి(ఎస్)ల సంకీర్ణ ప్రభుత్వం 14 నెలలకే కుప్పకూలిపోయింది. అయితే దేశంలో ఇంతవరకు సంకీర్ణ ప్రభుత్వాలన్నవి భాగస్వామ్య పార్టీలు మద్దతు ఉపసంహరించడం వల్ల పడిపోతూ వచ్చాయి. కాని కర్నాటకలో కుమారస్వామి ప్రభుత్వానికి ముప్పు బీజేపీ రూపంలో ఎదురైంది. ఆయన కాంగ్రెస్ తనను ఏదో ఒకరోజు ముంచుతుందని భయపడుతూ వచ్చారు. ఈ 14 నెలలు కూడా ఆ పార్టీతో కాపురాన్ని భారంగానే నెట్టుకొచ్చారు. అయితే ఆయనకు బీజేపీ ఇంకో రూపంలో షాకిచ్చింది. కాంగ్రెస్ - జెడి(ఎస్) రెబల్స్‌ను రెచ్చగొట్టింది. 17 మంది ఎమ్మెల్యేలను వారి నుండి బయటకు తెచ్చింది. ముంబైలో వారితో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేసింది. దీంతో కుమారస్వామి ప్రభుత్వం మైనార్టీలో పడింది. రెబల్స్ ఎమ్మెల్యేలను బుజ్జగించి దారిలోకి తెచ్చేందుకు కాంగ్రెస్, జెడి(ఎస్) అధినేతలు విశ్వప్రయత్నాలు చేశారు. కాంగ్రెస్ అధిష్టానమైతే క్యాంప్‌ల స్పెషలిస్ట్ డి.కె.శివకుమార్‌ను రంగంలోకి దించింది. ఎన్ని చేసినా లాభం లేకపోవడంతో బంతి గవర్నర్ కోర్టులోకి వెళ్లింది. తగిన సంఖ్యా బలం లేని కుమారస్వామిని ఇక గద్దె దించడం సులభం అనుకున్నాక గవర్నర్ వఝూభాయ్ వాలా ఆయనను సభలో బలం నిరూపించుకోమని ఆదేశించారు. 17 మంది రెబల్స్ సభకు హాజరు కాని పక్షంలో మెజార్టీ మార్క్ 104 మంది కాగా, కుమారస్వామి బలం 99 వద్దే ఆగిపోయింది. దీంతో ఆయన సీఎం పదవికి రాజీనామా చేశారు. ఇక కర్నాటక సీఎం కుర్చీ కోసం 14 నెలలుగా అవిశ్రాంతంగా పోరాడుతున్న యడ్యూరప్పకు గవర్నర్ నుండి పిలుపు రావడం, ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం, సభలో తమకున్న బలం 105మందితో పాటు మరో స్వతంత్ర ఎమ్మెల్యే మద్దతు పొందడం ద్వారా మెజార్టీ మార్క్‌ను దాటడం జరిగాయి. అయితే ఈ మొత్తం అంకంలో కర్నాటక స్పీకర్ కె.ఆర్.సురేష్‌కుమార్ నిర్వహించిన పాత్ర ప్రశంసనీయమైనది. కాంగ్రెస్ - జెడి(ఎస్)ల నుండి గెలిచి, పార్టీ విప్‌ను ధిక్కరించిన 17మంది రెబల్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడమే కాకుండా మూడేళ్ల పాటు ఎన్నికలలో పోటీకి అనర్హులుగా ప్రకటించారు. స్పీకర్ అంటే ఎలా విధులు నిర్వర్తించాలో చూపించారు. ఒక పార్టీ గుర్తు మీద గెలిచి ఇంకో పార్టీలోకి జంప్ చేసే ప్రజాప్రతినిధులకు ఇలాంటి నిర్ణయాలు కనువిప్పు కావాలి. అలాగే రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన పదవుల్లో వుంటూ రాజకీయ కొనుగోళ్లు, అమ్మకాలను ప్రోత్సహించే వారికి కూడా ఇది గుణపాఠం కావాలి.

2014-2019ల మధ్య రెండు తెలుగు రాష్ట్రాలలో ఎమ్మెల్యేలు, ఎంపీల కొనుగోళ్లు ఏ విధంగా జరిగాయో చూశాం. తెలంగాణ కాంగ్రెస్, తెలుగు దేశం ఎమ్మెల్యేలను కేసీఆర్ గొర్రెల్లా కొని మంత్రి పదవులు కూడా ఇచ్చాడు. ఏపిలో 23మంది ఎమ్మెల్యేలను, ముగ్గురు ఎంపీలను చంద్రబాబు కొని అందులో నలుగురు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కూడా ఇస్తుంటే అప్పుడు స్పీకర్‌గా వున్న కోడెల శివప్రసాద్‌రావు దానినో పవిత్రకార్యంగా చూశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసు కోవాలన్న అప్పటి ప్రతిపక్ష వైసిపి ఫిర్యాదును ఆయన కంటితో కూడా చూడలేదు. ఇటువంటి స్పీకర్‌లతో పోలిస్తే స్పీకర్‌గా రమేష్‌కుమార్ పోషించిన పాత్ర ఎంతో గొప్పదని భావించాలి.

కేంద్రంలోగాని, రాష్ట్రాలలో గాని ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు కూలినప్పుడే రాజ్యాంగ పదవుల్లో వున్నవారు తీసుకునే నిర్ణయాలు అత్యంత ప్రభావవంతంగా వుంటాయి. మంచి పేరైనా, చెడ్డ పేరైనా వారికి ఇలాంటి సందర్భాలలోనే వస్తుంది. 1984లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కూలదోసిన పాపం అప్పటి గవర్నర్‌గా రామ్‌లాల్ పేరు మీద నమోదైపోయింది. అలాగే 20ఏళ్ల క్రితం యూపిలో బీజేపీ ప్రభుత్వాన్ని అడ్డదారిలో కూలదోయాలనుకున్న అప్పటి గవర్నర్ రమేష్ భండారీ కుట్రలను తిప్పికొట్టిన ఆనాటి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ పేరు రాజ్యాంగ రక్షకుడి జాబితాలో నిలిచిపోయింది.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు పడిపోతుంటాయి, నిలబడుతుంటాయి. అయితే విలువలతో ప్రభుత్వాలను ఏర్పాటు చేయడమన్నదే ప్రధాన అంశం. ఇప్పుడు కర్నాటకలో ఏర్పడ్డ బీజేపీ ప్రభుత్వ పునాదులు కూడా విలువల పరంగా బలహీనమే! యడ్యూరప్పది పూర్తి మెజార్టీతో ఏర్పడ్డ ప్రభుత్వం కాదు. ప్రజాస్వామ్య కోణంలో చూస్తే ప్రజాతీర్పును కాలరాసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారనే చెప్పాలి. ఇలాంటి రాజకీయ నికృష్టాలే ప్రజాస్వామ్య వ్యవస్థకు పెద్ద అంటురోగంగా మారుతున్నాయి.

### శాకాంబరి అలంకారంలో..

# శోభాయమానంగా మహాలక్ష్మీదేవి

నెల్లూరు ఫతేఖాన్‌పేటలోని అరిగెలవారివీధిలో కొలువైవున్న శ్రీమహాలక్ష్మీదేవికి గతనెల 26న శోభాయమానంగా శాకాంబరి అలంకారం నిర్వహించారు. అనేక రకాల కూరగాయలను అందంగా మాలలుగా కూర్చి చేసిన ఈ అలంకారం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. వర్షాలు బాగా కురవాలని, పంటచేలు పండి జిల్లా ప్రజలు పాడిపంటలతో కళకళలాడాలని కోరుకుంటూ లోకకల్యాణార్థం భక్తమండలివారు అమ్మవారికి ఈ ప్రత్యేక అలంకారం నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో స్థానిక ప్రముఖులు గోపిశెట్టి కల్యాణ్‌కుమార్, మహాలక్ష్మి బాలసంఘం సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

# గీతాంజలిలో ముగిసిన 6 రోజుల వర్క్‌షాప్




గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఇటీవల ప్రారంభమైన ఆరురోజుల వర్క్‌షాప్ జూలై27తో ముగిసింది. ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో కళాశాల ప్రిన్సిపాల్ డా.జి.సుబ్బారావు మాట్లాడుతూ అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై తృతీయ సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ వర్క్‌షాప్‌లో సమగ్రమైన అవగాహన కల్గించామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు హనూష, రామకృష్ణ పాల్గొని ఈ అంశంలో ఇమిడివున్న అనేక సాంకేతిక విషయాలను విద్యార్థులకు విశదీకరించి అవగాహన కలిగించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇసిఇ విభాగాధిపతి పి.రాఘవరెడ్డి, కోఆర్డినేటర్ కె.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# అన్ని రాష్ట్రాలు ఇదే చట్టం తెస్తే...

పరిశ్రమలలో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం చట్టం తెచ్చింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలనుకునేవారికి ఇది పెద్ద అడ్డంకిగా మారే అవకాశముంది. ఏ కంపెనీ అయినా నిపుణులైన కార్మికులు, ఉద్యోగుల శ్రమతోనే అభివృద్ధి చెందుతుంది. సంస్థలు అభివృద్ధి చెందే కొద్దీ ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతుంటాయి. అనుభవజ్ఞులు, కష్టపడి పనిచేసే ఉద్యోగులను ఎంపిక చేసుకునే అవకాశం కూడా కంపెనీలకే ఇవ్వాలి. స్థానికంగా పరిశ్రమలు పెట్టాక స్థానికులకు ఎన్నోకొన్ని ఉద్యోగాలు వస్తుంటాయి. అసలు పరిశ్రమలు, కంపెనీలే రాకుంటే ఈ కొన్ని ఉద్యోగాలైనా ఎక్కడి నుండి వస్తాయి? మన రాష్ట్రంలాగే తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలు కూడా ఇదే విధమైన చట్టం తెస్తే అక్కడున్న ఆంధ్రా ఉద్యోగుల పరిస్థితి ఏంటి?

**బి.వెంకటేశ్వర్లు, నెల్లూరు.**

# మంచిపని చేశారు

తిరుమలలో ఎల్1, ఎల్2, ఎల్3 అనే విఐపి దర్శనాలను ఎత్తేసి మంచిపని చేశారు. ప్రోటోకాల్ దర్శనానికి కూడా సమయాన్ని తగ్గించాలి. అసలు వారానికి రెండురోజులు మాత్రమే ప్రోటోకాల్ దర్శనం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలి. సర్వదర్శనం భక్తుల సమయాన్ని ఇంకో గంట పెంచడం ద్వారా ఎక్కువ సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనం చేసుకునే అవకాశముంటుంది. విఐపి బ్రేక్ దర్శనం సమయాన్ని కూడా తగ్గించినందుకు టిటిడి ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డికి అభినందనలు.

**పి.ఎస్.రెడ్డి, నెల్లూరు.**

# పొగడ్తలు ఆపండి!

తెలుగుదేశం ప్రభుత్వంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చంద్రబాబును పొగిడిందే పొగిడి ఆయనను శంకరగిరి మాన్యాలకు పంపించారు. ఇప్పుడు వైసిపి ప్రభుత్వంలోనూ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి భజన చేయడమే కొందరు ఎమ్మెల్యేలు పనిగా పెట్టుకున్నారు. జగన్‌ను ఏసు, అల్లా, సాయిబాబా అంటూ ఆకాశంలోకెత్తేస్తున్నారు. పొగడ్తలు ఒక స్థాయిలో అభినందనగానే వుండాలిగాని, మునగచెట్టెక్కించేటట్లుండ కూడదు. ఇలాంటి పొగడ్తలే చేటు తెస్తాయి.

***గంజాం శ్రీనివాసులు, ఎస్.కొండ.***

# అమ్మకు నివాళి

'లాయర్' వారపత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి గారి సతీమణి శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ మరణం విచారకరం. ఆమె మృతి తుంగా కుటుంబసభ్యులకు తీరని లోటు. మాతృమూర్తిని కోల్పోయి బాధలో వున్న 'లాయర్' సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాము.

డాక్టర్ ఎస్.బాబురావు, కావలి.

# స్థానిక ఉద్యోగుల నిబంధన...



# అభివృద్ధికి వరమా? శాపమా?

**ముత్తుకూరు మండలం నేలటూరులోని జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రంలోని చిమ్నీ చిట్ట చివరన ఓ వ్యక్తి తాడుకు వేలాడుతూ పనిచేస్తుంటాడు. ఈ చిమ్నీ ఎత్తే పాతిక అంతస్థుల భవనం అంత ఉంటుంది. అక్కడ నుండి ఏ మాత్రం జారిపడినా ఎముకలు కూడా మిగలవు. అలాంటి పనులు చేయాలంటే ధైర్యంతో పాటు అనుభవం కూడా వుండాలి. ఆ చిమ్నీల అంచున వేలాడుతూ పని చేసేవాళ్ళు ఏ బీహార్ వాళ్ళో, జార్ఖండ్‌వాళ్ళో అయ్యుంటారు. అలాంటి పనులకు స్థానికంగా మనుషులు దొరకరు. మరి స్థానికులు కాదని బీహార్‌వాళ్ళను ఇక్కడ నుండి పంపించేద్దామా? స్థానికంగా పరిశ్రమలలో 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన కొత్త చట్టం ఇలాంటి ప్రశ్నలనే మిగిలిస్తోంది. ముఖ్యంగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందాల్సిన నెల్లూరు జిల్లాపై తీవ్ర ప్రభావం చూపబోతుంది.**

స్థానికులకు ఉద్యోగాలు అనే దానిపై రెండు పరస్పర విరుద్ధ కోణాలున్నాయి. పరిశ్రమలు పెట్టే పెట్టుబడిదారుల వైపు నుండి చూస్తే... వేల కోట్లాది రూపాయల వ్యయంతో పరిశ్రమలు పెడతాం. పరిశ్రమలలో ఉత్పాదన కోసం అనుభవం, నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించుకుంటేనే మా లక్ష్యాలను చేరుకోగలం... వాళ్ళు ఏ ప్రాంతంవాళ్లైనా మా సంస్థలకు ఉపయోగపడేటట్లుగా వుండాలి. ఇందులో అనుభవం నైపుణ్యం ఉంటే స్థానికంగా వున్నోళ్లను కూడా తీసుకుంటున్నాం, నాన్‌టెక్నికల్ వింగ్స్‌లో ఎక్కువగా స్థానికులకే ప్రాధాన్యతనిస్తున్నాం. అలా కాకుండా అన్ని విభాగాలలోనూ 75శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలంటే రేపు రకరకాల సమస్యలొస్తాయి. మేం బయట ప్రాంతాల నుండి వచ్చి పెట్టుబడులు పెడతాం. స్థానికంగా మాకంటే ఇక్కడి వారికే పట్టు ఎక్కువ వుంటుంది. రేపు ఉద్యోగులతో ఏవన్నా సమస్యలు వచ్చినప్పుడు స్థానిక రాజకీయ నాయకులు వాళ్ళకే మద్దతునిస్తారు. అప్పుడు మాకు, మా పెట్టుబడులకు దిక్కెవరు అనేది వారి ఆవేదన!

రెండో కోణంలో చూస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు కోరుతున్న వారి వాదనను కూడా కొట్టిపారేయలేము. ఇతరత్రా ఉపాధి అవకాశాలుంటే మాకు ఈ పరిశ్రమలలో పనులెందుకు? వ్యవసాయ పరంగా కాని, ఇంకో రకంగా కాని పనులు లేని చోటే కదా పరిశ్రమలు పెట్టేది. స్థానికులకు పని దొరుకుతుందనే కదా ప్రభుత్వం కూడా పరిశ్రమలను పెట్టమని కోరేది! పరిశ్రమల కోసం మా భూములే ఇస్తున్నాం, పరిశ్రమల నుండి వచ్చే కాలుష్యాన్ని మేమే భరిస్తున్నాం... అలాంటప్పుడు ఆ పరిశ్రమల ద్వారా మాకు బ్రతుకుదెరువు కల్పిస్తే తప్పేంటనేది స్థానికుల ఆవేదన.

ఇరు వర్గాల వైఖరి, ధోరణులు కూడా సరైనవే! ఉద్యోగాలలో స్థానికులకు పెద్దపీట వేద్దామన్న మంచి ఆలోచన పెట్టుబడిదారులకు వుండాలి. అలాగే మనకు ఉపాధి చూపించిన సంస్థ అభివృద్ధికి ఇంకొంచెం కష్టపడదామనే చిత్తశుద్ధి స్థానికులకు వుండాలి. కాని, ఈ రెండింటికి అవకాశం లేకుండా పోతుంది. స్థానికులకు ఉద్యోగాలు ఇస్తే రాజకీయ జోక్యాలు పెరిగిపోతాయని, పనికంటే పెత్తనాలు ఎక్కువ చేస్తుంటారని పరిశ్రమల యాజమమాన్యాలు అనుమానిస్తుంటాయి. గత కొన్నేళ్లలో జిల్లాలో వున్న పలు సెజ్‌లలో ఈ సంఘటనలు జరిగాయి కూడా!

జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి పురుడు పోసింది దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డే! కృష్ణపట్నం, శ్రీసిటి, మేనకూరు సెజ్, ఇఫ్కో సెజ్, చింతవరం, మాంబట్టు సెజ్‌లన్నీ ఆయన మానసపుత్రికలే! ఈ సెజ్‌లలో కొన్ని లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయి. వారిలో ఖచ్చితంగా 40 నుండి 50శాతం మంది స్థానికులే వున్నారు. పరిశ్రమలు రావడం మూలంగా వాటిలో ఉద్యోగాల ద్వారానే కాదు, పరోక్షంగా కూడా ఎంతోమందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. వై.యస్.రాజశేఖరరెడ్డి మరణం తర్వాత జిల్లాలో పారిశ్రామిక ప్రగతి కుంటుపడిపోయింది. గత 5ఏళ్ళ చంద్రబాబు పాలనలో అయితే ఇఫ్కో సెజ్‌లో గమేషా పరిశ్రమ తప్పితే ఇంకోటి రాలేదు.

వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా రావడంతో జిల్లాలో మళ్ళీ పారిశ్రామికాభివృద్ధి మొదలవుతుందనే ఆశలు చిగురించాయి. కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటి, మేనకూరు, ఇఫ్కో సెజ్‌లకు భారీగా పరిశ్రమలు రావొచ్చని భావిస్తున్నారు. అయితే 75శాతం స్థానిక ఉద్యోగాల నిబంధన దానికి కొంత ప్రతిబంధకంగా మారే అవకాశం లేకపోలేదు. ముందు పెట్టుబడులనేవి వస్తే... ఎన్నోకొన్ని ఉద్యోగాలు ప్రత్యక్షంగానో పరోక్షంగానో వస్తాయి.



ఇటీవలే తన మాతృమూర్తిని కోల్పోయిన 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డిని జూలై 29వ తేదీ నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శిస్తున్న పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి

# 'నుడా'పై... ప్రతాప్ కన్ను?



నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ(నుడా)... దీనికి గత ప్రభుత్వంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఛైర్మన్‌గా వుండడం తెలిసిందే! ఒక స్థాయి కలిగిన నాయకులు ఈ పదవిని ఆశించడం రివాజు. ఇప్పుడు వైసిపి ప్రభుత్వంలో ఎమ్మెల్యేలే ఈ పదవిని ఆశిస్తుండడం విశేషం. నుడా ఛైర్మన్ పదవిని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆశిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈమేరకు ఆయన తన మనసులోని కోరికను సీఎం జగన్‌కు చెప్పడం, ఆయన ఓకే అనడం కూడా జరిగిపోయిందని సమాచారం.

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి రాగానే కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంత్రి పదవి కోసం ట్రయల్ వేశాడు. అయితే రేస్‌లో వివిధ కారణాలతో ఆయన చాలా వెనుకబడ్డాడు. ఇంతకుముందు హైదరాబాద్ రాజధానిగా వున్నప్పుడు ఎమ్మెల్యేలకు ఇంకో పదవిపై మనసు మళ్లేది కాదు. ఎమ్మెల్యేగా హైదరాబాద్‌లోనే వాళ్ళకు సరిపోయేది. ఇప్పుడు ఎమ్మెల్యేలకు అమరావతి రాజధాని సరిపోవడం లేదు. అసెంబ్లీ సమావేశాలకు తప్పితే అక్కడ పనేమీ లేదు. అందుకే స్థానికంగా అడ్డా ఒకటి వుండాలనుకుంటున్నారు. 'నుడా'కైతే నెల్లూరులో ఒక ఆఫీసు, అడ్రస్సు ఉంటుంది. కావలి నుండి తడ దాకా 'నుడా' పరిధిలోనే వుంది. కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటి సహా అన్ని సెజ్‌లు 'నుడా' పరిధిలోకే వస్తాయి. భవిష్యత్‌లో 'నుడా' ఛైర్మన్ పదవి 'తుడా'(తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి) ఛైర్మన్ అంత ప్రాధాన్యత సంతరించుకోబోతోంది. మంత్రి పదవిని ఇవ్వలేకపోయినందుకు తుడా ఛైర్మన్‌గా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని సీఎం నియమించడం తెలిసిందే! ఆయనను చూసే రామిరెడ్డి ప్రతాప్ కూడా నుడా ఛైర్మన్ పదవిని కోరాడని తెలుస్తోంది.


## అమ్మకు అశ్రునివాళి..



శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారు

జననం : 16.10.1930 మరణం : 20.07.2019

TAX CARE & MANAGEMENT SERVICES PVT. LTD., NELLORE

### ఆదాల కృషితో...

# కేంద్రీయ విద్యాలయంలో 25సీట్లు



నెల్లూరులోని కేంద్రీయ విద్యాలయంలో నెల్లూరు ఎంపి కోటా క్రింద పది సీట్లుంటాయి. గతంలో మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఎంపీగా వున్నప్పుడు ఈ పది సీట్ల కోసం ఎంతోమంది పోటీ పడేవాళ్ళు. ఆయన ఎవరినీ బాధపెట్టలేక 10మందిని లాటరీ ద్వారా ఎంపిక చేసేవాళ్ళు. ఇప్పుడు ఎంపీగా వున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈ విద్యా సంవత్సరంలో కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి 25మంది విద్యార్థులు తనను ఆశ్రయించగా అందరికీ సీట్లు వచ్చేలా కృషి చేశారు. ఎంపీ కోటా క్రింద 10సీట్లే వున్నప్పటికీ, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రితో మాట్లాడి మిగతా 15సీట్లు కూడా మంజూరు చేయించుకున్నారు. తన వద్దకొచ్చిన ప్రతి విద్యార్థికి కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశం కల్పించినందుకు ఆయన ఎంతో సంతోషం వ్యక్తం చేశారు.

అలాగే నెల్లూరు లోక్‌సభ పరిధిలోని కావలి, ఆత్మకూరు, కందుకూరులలో కూడా కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ప్రయత్నిస్తానని ఆయన ఒక ప్రకటనలో హామీ ఇచ్చారు. గతంలో కందుకూరు వద్ద కేంద్రీయ విద్యాలయం మంజూరైనా రాలేదని సంబంధిత మంత్రితో మాట్లాడి సాధిస్తానన్నారు. నెల్లూరు రింగ్‌రోడ్, రామాయపట్నం బీచ్ రోడ్లకు కూడా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే బిట్రగుంటలో రైల్వే అభివృద్ధికి సంబంధిత రైల్వేమంత్రితో చర్చిస్తానని, బిట్రగుంట రైల్వే పరిశ్రమలకు ఎంతో అనువుగా వుంటుందని వెల్లడించారు.

# జగన్ పాలనపై జనం పెదవి విరుపు

**- బీద రవిచంద్ర**



రెండు నెలల్లోనే వై.యస్.జగన్మోహన్‌రెడ్డిపై రాష్ట్ర ప్రజలకు ఏవగింపు కలిగిందని, ఆయన చేస్తున్న పనులను చూసి ప్రజలు నిరుత్సాహంతో పెదవి విరుస్తున్నారని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ఆరోపించారు. గత నెల 28వతేదీ నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ రెండు నెలల్లోనే జగన్‌పై జనం పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయన్నారు. ఈ రెండు నెలల్లో తెలుగుదేశం పార్టీపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం తప్ప ఆయన ప్రజల కోసం చేసిందేమీ లేదన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో జరగని అవినీతిని జరిగినట్లు చూపించడానికి ఆయన పడుతున్న అవస్థలు చూసి జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలలో ఎలాంటి అవినీతి జరగలేదని కేంద్రమే చెప్పినా జగన్మోహన్‌రెడ్డి అందులో ఏదో వుందని కొండను తవ్వుతున్నాడని, అందువల్ల ఎలుకలు కూడా దొరకవన్నారు. పోలవరంలో అవినీతి జరగలేదని పార్లమెంటులో స్వయంగా కేంద్ర జలవనరులశాఖ మంత్రే ప్రకటించినా, దాని గురించి భూతద్దంలో చూపిస్తూ చంద్రబాబుపై బురద చల్లాలని కుట్ర పన్నుతున్నారని విమర్శించారు.

ఈ సమావేశంలో మాజీమంత్రి టి.రమేష్‌రెడ్డి, టిడిపి నాయకులు బెజవాడ ఓబులరెడ్డి, టి.అనురాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పి.చెంచలబాబుయాదవ్, చేజర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, హరిబాబుయాదవ్ పాల్గొన్నారు.



# యమదూతల్లా... ఇసుక ట్రాక్టర్లు!

ఇసుక తవ్వకాలు జరపకపోతే... నిర్మాణాలు ఆగిపోతాయి. కార్మికులకు పనులుండవు... వ్యాపారాలు స్తంభించిపోతాయి. ఇదొక సమస్య. దీనిని అధిగమించాలంటే ఇసుక సరఫరాకు అనుమతివ్వాల్సిందే!

మరి ఇస్తే... నెల్లూరు నగరం రోడ్లపై ఇసుక ట్రాక్టర్ల స్వైర విహారం... ఒక దాంతో ఒకటి రేస్ గుర్రాల్లా పోటీ... ఎక్కడ యాక్సిడెంట్‌లు జరుగుతాయో తెలియని పరిస్థితి. ట్రాక్టర్‌లకు అసలు బ్రేకులే పడిచావవు. తోలేవాళ్ళకు అసలు లైసెన్స్‌లున్నాయో లేదో కూడా తెలియదు. ఈ మధ్యంతా ఇసుకపై నిషేధం వుండడంతో వేలసంఖ్యలో ట్రాక్టర్‌లు ఇళ్ళకే పరిమితమై వుండిపోయాయి. ఎప్పుడైతే ప్రభుత్వం తహశీల్దార్‌లు, ఆర్టీఓల ద్వారా ఇసుక తోలడానికి అనుమతినిచ్చిందో అప్పటి నుండి ట్రాక్టర్లన్నీ రోడ్డెక్కాయి. నెల్లూరు, జొన్నవాడ రోడ్డులోని పొట్టేపాలెం రీచ్ నుండి నెల్లూరు నగరంలోకి వందల ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. జొన్నవాడ రోడ్డులో ఇసుక ట్రాక్టర్‌ల వరుసను చూస్తే ఏదో ర్యాలీ జరిగినట్లుగా వుంటోంది. అనుమతినిచ్చారుకదా అని చెప్పి వేళాపాళా లేకుండా తిరుగుతున్నాయి. గతంలో రాత్రి 9గంటల నుండి ఉదయం 9గంటల దాకా, మధ్యాహ్నం ఒంటి గంట నుండి 5గంటల దాకా ఇసుక ట్రాక్టర్‌లు తిరగడానికి అనుమతించేవాళ్ళు. ఇప్పుడు పగలు, రాత్రి తేడా లేకుండా తిరుగుతున్నాయి. స్కూల్స్ టైంలో విద్యార్థులతో ఆటోలు, బస్సులు ఎక్కువగా వెళుతుంటాయి. చిన్నపిల్లలు రోడ్డు దాటుతుంటారు. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లకు ఈ స్పృహ వుండదు. ఎక్కువ ట్రిప్పులు తోలాలనే ఉద్దేశ్యంతో విచక్షణా జ్ఞానం మరిచి అతివేగంగా ట్రాక్టర్‌లు నడుపుతుంటారు. ఇలాంటి సమయంలోనే ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశముంది. కాబట్టి జిల్లా ఉన్నతాధికారులు ఇసుక ట్రాక్టర్‌లకు సరైన సమయం నిర్ణయిస్తే మంచిది.

# గవర్నర్‌ను కలిసిన విఎస్‌యు వి.సి

విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య ఆర్.సుదర్శనరావు జూలై 29వ తేదీ విజయవాడలో రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయంకు సంబంధించిన కోర్సులు, భవనాలు అభివృద్ధి పనులపై నివేదికనందించారు. యూనివర్శిటీ స్నాతకోత్సవానికి అనుమతినివ్వాలని కోరారు. దీనిపై గవర్నర్ స్పందిస్తూ యూనివర్శిటీని ఉన్నతంగా తీర్చిదిద్దాలని, త్వరలోనే స్నాతకోత్సవం నిర్వహణకు తేదీలను ప్రకటిస్తానని హామీ ఇచ్చారు.

# ఇకనుంచి అది డాక్టర్ బేర్ రోడ్

ఎన్నో ఏళ్ళుగా మనకు రైల్వేఫీడర్స్ రోడ్డుగా పరిచయమైన సంతపేట నుండి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డును ఇక నుండి డాక్టర్ బేర్ రోడ్‌గా మార్పు చేశారు. ఈమేరకు నగరపాలక సంస్థ ఆమోదించింది కూడా. అమెరికాకు చెందిన డాక్టర్ బేర్ నెల్లూరు, రైల్వేఫీడర్స్ రోడ్డులోని అమెరికన్ బాప్టిస్ట్ ఆసుపత్రిలో ఎన్నో ఏళ్ళ పాటు వైద్యసేవలందించింది. విదేశీయురాలైనప్పటికి తన సేవలతో ఇక్కడి ప్రజల మనసుల్లో డాక్టర్ బేరమ్మగా ముద్రపడిపోయింది. అప్పట్లో స్థానికంగా చర్చి, ఆసుపత్రి వర్గాలలో నెలకొన్న వివాదాల మూలంగా ఆమె తన దేశానికి తిరిగి వెళ్ళిపోయినప్పటికీ ఆమెను స్థానికులు మరచిపోలేదు. ఇప్పుడు ఆమె పేరు కలకాలం గుర్తిండేలా రైల్వేఫీడర్స్ రోడ్డుకే ఆమె పేరును పెట్టడం ఎంతైనా సముచిత నిర్ణయం.

# పీజీ సెమిస్టర్‌లో 'కృష్ణచైతన్య' ఫస్ట్



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

విక్రమసింహపురి యూనివర్శిటీ ఇటీవల విడుదల చేసిన నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో ఎంబిఏ, మరియు ఎమ్మెస్సీ, మ్యాథమేటిక్స్ విభాగాల్లో కృష్ణచైతన్య విద్యార్థులు ప్రథమస్థానం సాధించారని ఆ కళాశాల డైరెక్టర్లు డా.ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెస్సీ, మ్యాథ్స్, ఎంబిఏ విభాగాల్లో సిహెచ్ శ్రీలక్ష్మి 87 శాతం, ఎస్‌డి సాబీరా 86శాతం, ఎం.హరిత 85 శాతం, ఆర్.డాలీజైన్ 78 శాతం, ఎస్‌కె మెహరాజ్ 78శాతం, ఆర్.వర్ష 77శాతం మార్కులతో యూనివర్శిటీ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించారన్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. ప్రిన్సిపాల్స్ మల్లికార్జునయ్య, జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన నగర డీఎస్పీ

నెల్లూరు పొదలకూరురోడ్డు పోలీస్ కాలనీలో జూలై 28న వేదాయపాళెం పోలీసుల ఆధ్వర్యంలో వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి మొక్కలు నాటి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడుతాయన్నారు. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఎస్సై లక్ష్మణ్, సిబ్బంది పాల్గొని మొక్కలు నాటారు.

## నెల్లూరు కబుర్లు

### జర్నలిస్టుల హెల్త్‌స్కీం

# గడువు పొడిగింపు

వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్‌స్కీం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2019-20 ఆర్థిక సంవత్సరం వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని జిల్లా పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వున్న వర్కింగ్ జర్నలిస్టులంతా ఆగస్టు 13వ తేదీలోపు ప్రీమియం 1250 రూపాయలు చెల్లించి 2020 మార్చి 31 వరకు ఈ పథకం క్రింద లబ్ధిదారులు కావాలని కోరారు. సిఎంఎన్‌ఎస్‌పి వెబ్‌సైట్‌లో ప్రీమియం చెల్లించాలని, ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, అక్రిడిటేషన్ కార్డు జెరాక్స్ కాపీని తమ కార్యాలయంలో అందజేయాలని కోరారు. కొత్తగా ఆరోగ్య పథకానికి దరఖాస్తు చేసుకునే జర్నలిస్టులైతే తమ కుటుంబ వివరాలు, ఆధార్‌కార్డు, నిర్ణీత నమూనాతో ఫోటోలు అందజేయాలని ఆయన కోరారు.

### రాజరాజేశ్వరీ అమ్మవారి

# శ్రావణమాస మహోత్సవాలు

నెల్లూరు దర్గామిట్టలో వేంచేసియున్న భక్తుల కొంగు బంగారం, కోరిన కోరికలు తీర్చే తల్లి శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 2వ తేదీ శుక్రవారం నుండి శ్రావణమాస మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరాం తెలిపారు. ఆగస్టు 2వ తేది మొదటి శుక్రవారం ఉదయం 9గంటలకు అమ్మవారికి లక్ష కుంకుమార్చన, 9 వ తేది రెండవ శుక్రవారం ఉదయం 10 గంటలకు అమ్మవారికి సామూహిక వరలక్ష్మీ వ్రతం, 16వ తేది మూడవ శుక్రవారం ఉదయం 9 గంటలకు అమ్మవారికి లక్ష కుంకుమార్చన, 23వతేదీ నాల్గవ శుక్రవారం ఉదయం9 గంటలకు లక్ష కుంకుమార్చన, 30న ఐదవ శుక్రవారం ఉదయం 9 గంటలకు అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23వ తేది శ్రీ కనకదుర్గా సేవాసమితి వారిచే అమ్మవారికి లక్ష్మీ కాసులతో ప్రత్యేక అలంకరణ జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

# రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం

రోటరీక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జూలై 28న నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రక్కన గల ఓ హోటల్‌లో జరిగింది. 2019-20 రోటరీ క్లబ్ నెల్లూరు సౌత్ అధ్యక్షుడిగా మురిగిపూడి సతీష్ కుమార్, కార్యదర్శిగా అజీజ్, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలిగా సుభాషిణి, కార్యదర్శిగా మొబిన్, రోటరాక్ట్ అధ్యక్షుడిగా నీలేష్ కుమార్, కార్యదర్శిగా వెంకట సూర్యతో రోటరీ మాజీగవర్నర్ శ్రీరామమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రోటరీ సంస్థలు అందిస్తున్న సేవలను అభినందించారు. అనంతరం క్లబ్ సభ్యుడు గాదంశెట్టి గోపాల్ పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన వారికి, ట్రిపుల్ ఐటీ నూజివీడులో ప్రవేశం పొందిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. రోటరీ మాజీ గవర్నర్ దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ మూర్తి, వొమ్మిన నాగసతీష్‌బాబు, భానుమతి, తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ కరదీపికను ఆవిష్కరిస్తున్న డిఆర్‌డిఓ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు తదితరులు

# శాస్త్ర విజ్ఞానమే.. ప్రగతికి సోపానం

## - డిఆర్‌డిఓ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి

శాస్త్ర విజ్ఞానమే అభివృద్ధికి సోపానమని, విజ్ఞాన శాస్త్రం పట్ల ప్రతి విద్యార్థి ఆసక్తి పెంచుకోవాలని డిఆర్‌డిఓ ఛైర్మెన్ గంట్ర సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. జూలై 28వ తేదీన వెంకటాచలం చెముడుగుంటలోని సైన్స్ సెంటర్‌లో డాక్టర్ సి.వి.రామన్ విగ్రహాన్ని, ఆకాశ్ క్షిపణి నమూనాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ సైన్స్ పట్ల విద్యార్థుల్లో మక్కువ ఏర్పడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సైన్స్ మ్యూజియంకు యాంటీ శాటిలైట్ మిషన్ నమూనాను బహూకరిస్తానని, తన పరిధిలోని సంస్థల ద్వారా శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అన్ని వసతులను ఈ సైన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు.

జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు మాట్లాడుతూ మారుతున్న ఆధునిక కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచాలని, భావి శాస్త్ర వేత్తలుగా వారిని తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాల స్థాయి నుండే విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తిని కలిగించాలన్నారు. శాస్త్రీయ విజ్ఞానాన్ని అభివృద్ధి చేసే విధంగా ప్రభుత్వాలు కూడా ఎంతో ప్రోత్సహిస్తున్నాయని చెప్పారు. ఈ సైన్స్ మ్యూజియంలో సెమినార్‌లు, సైన్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహించడానికి వీలుగా 4వేల చదరపు అడుగుల భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర భౌతికశాస్త్రం ఫోరం కార్యదర్శి సురేంద్రరెడ్డి రూపొందించిన భౌతిక, రసాయన శాస్త్రాల కరదీపకను సతీష్‌రెడ్డి ఆవిష్కరించారు. అలాగే సైన్స్ సెంటర్ ఉపాధ్యాయులు సతీష్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. డిఇఓ జనార్ధనాచారి, డిప్యూటి డిఇఓ విజయలక్ష్మి, సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ అధికారి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గూడూరు - విజయవాడ మధ్య

# ఇక హ్యాపీ జర్నీ

**ఈ నెలలోనే పట్టాలెక్కనున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్**



భారత ఉపరాష్ట్రపతి, నెల్లూరీయుడు యం.వెంకయ్యనాయుడు పుణ్యాన నెల్లూరు జిల్లా రైల్వే ప్రయాణీకుల కోసం ఓ మంచి రైలు మంజూరైంది. ఇటీవల కాలంలో నెల్లూరు పర్యటనకొచ్చిన కేంద్ర రైల్వేశాఖ మంత్రి పీయుష్‌గోయల్ త్వరలో గూడూరు - విజయవాడల మధ్య ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెడతామని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సమక్షంలో ప్రకటించి వున్నారు. ఈ నెల 24, 25, 26తేదీలలో ఉపరాష్ట్రపతి యం.వెంకయ్య నాయుడు నెల్లూరుజిల్లా పర్యటనకు రానున్నట్లు తెలుస్తోంది. ఆయన చేతుల మీదుగానే ఈ రైలుకు పచ్చజెండా ఊపించే అవకాశాలున్నాయి.

గూడూరు - విజయవాడ మధ్య ప్రయాణించే ఈ రైలుకు నెంబర్లు కూడా ప్రకటించారు. విజయవాడ వైపు వెళ్లేటప్పుడు 27243గాను, గూడూరు వైపు వచ్చేటప్పుడు 27244 గాను నిర్ణయించారు. ప్రతిరోజూ ఉదయం 6.10 నిముషాలకు గూడూరులో బయలుదేరి 10.40 గంటలకల్లా విజయవాడకు చేరుకుంటుంది. అలాగే విజయవాడలో సాయంత్రం 6గంటలకు బయలుదేరి రాత్రి 10.30 గంటలకల్లా గూడూరుకు చేరుకుంటుంది. ఇప్పటివరకు నెల్లూరు-విజయవాడల మధ్య కరెక్ట్ టైంలో కరెక్ట్ ట్రైన్ లేదు. ఉదయం 8గంటలకు కృష్ణా ఎక్స్‌ప్రెస్ వున్నప్పటికీ దాంట్లో రిజర్వేషన్ కష్టం. అదీగాక ట్రైన్ విజయవాడకు వెళ్లేటప్పటికి మధ్యాహ్నం ఒంటి గంటవుతుంది. చెన్నై నుండి 9.45 గంటలకు వచ్చే జనశతాబ్ది పరిస్థితి అంతే! విజయవాడలో పొద్దునే పనులున్నోళ్లు ఎక్కువగా తెల్లారుజామున వెళ్లే యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్, లేదంటే 6.30గంటలకు వెళ్లే కేరళ ఎక్స్‌ప్రెస్‌లను ఆశ్రయిస్తుంటారు. ఇవన్నీ బెర్త్‌ల బోగీలు కావడంతో పగలు ప్రయాణం అంత సౌకర్యంగా వుండదు. ఇప్పుడు పట్టాలెక్కనున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ పూర్తి సిటింగ్‌తో 14కోచ్‌లతో వుంటుంది. ఇందులో రెండు ఏసి ఛైర్‌కార్‌లు, రెండు పవర్ కార్ కోచ్‌లు వుంటాయి. గూడూరు నుండి నెల్లూరు, కావలి, సింగరాయకొండ, చీరాల, బాపట్ల, తెనాలి, విజయవాడలలో స్టాపింగ్స్ వుంటాయి. ఇప్పుడు రాష్ట్ర రాజధాని పేరుకు అమరావతి అయినప్పటికీ అందరూ వుండేది విజయవాడ, ఆ చుట్టుపక్కల ప్రాంతాలలో! నెల్లూరుజిల్లా వాళ్ళు రాజధానిలో పనులున్నప్పుడు శుభ్రంగా ఈ రైల్లో పొద్దున్నే వెళ్లి పనులు చూసుకుని సాయంత్రం ఇదే ట్రైన్‌లో తిరిగి నెల్లూరుకు చేరుకోవచ్చు.

# ఎస్టీ గురుకులంలో కలెక్టర్ బస

నెల్లూరు జిల్లా కొడవలూరులోని గిరిజన బాలుర గురుకులంలో జిల్లా కలెక్టర్ యంవీ శేషగిరిబాబు జూలై 28న బస చేశారు. స్థానికంగా వున్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. వసతిగృహంలో 18 మంది విద్యార్థులు ఉండడం, కనీస మౌళిక వసతులు లేకపోవడం, వాచ్‌మెన్, వార్డెన్ లేకపోవడం గుర్తించి వసతిగృహ వాచ్‌మెన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. గురుకులంలో వెంటనే మరుగుదొడ్లను మంజూరు చేస్తానన్నారు. ఆర్వో ప్లాంట్ అవసరమని, దీన్ని మంజూరు చేస్తానని తెలిపారు. వసతి గృహాన్ని అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సోషల్‌వెల్ఫేర్ డీడీని ఆదేశించారు. ఐటీడీఏ పీఓ రోశిరెడ్డి, డీటీడబ్ల్యూఓ అంకయ్య, తహశీల్దార్ లావణ్య, ప్రిన్సిపల్ దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీ కృషి అభినందనీయం

## - రాష్ట్ర ఘనవ్యర్థాల నిర్వహణ సమితి అధ్యక్షులు శ్రీ శేషశయనారెడ్డి



వ్యర్థాల నిర్వహణలో శ్రీసిటీ చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని రాష్ట్ర హైకోర్ట్ మాజీ న్యాయమూర్తి, రాష్ట్ర ఘన వ్యర్థాల నిర్వహణ సమితి అధ్యక్షులు శేషశయనారెడ్డి అన్నారు. జూలై 26న ఆయనతో పాటు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులు శ్రీసిటీలో పర్యటించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ డైరెక్టర్ ముకుందరెడ్డి వారందరినీ సాదరంగా స్వాగతించి శ్రీసిటీ ప్రగతిని వివరించారు. కాలుష్య నియంత్రణ, వ్యర్థపదార్థాల నిర్వహణకు సంబంధించి శ్రీసిటీలో అమలులో ఉన్న కార్యసరళిపై అధికారులు వారికి వివరించారు. అనంతరం శ్రీసిటీలోని మురుగునీటి శుద్ధి కేంద్రం, ఘనవ్యర్థాల డంపింగ్‌యార్డ్, మొక్కల పెంపక కేంద్రం తదితరాలను సందర్శించారు. ఘనవ్యర్థాలలో పునర్వినియోగానికి ఉపయోగపడని జడపదార్థాలు సిమెంట్ ఫ్యాక్టరీలకు ఇంధనంగా ఉపయోగపడతాయని చెప్తూ, అందుకోసం సమీపంలో ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీలవారిని సంప్రదించవలసిందిగా శ్రీ శేషశయనరెడ్డి ఈ సందర్భంగా సూచించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు అనుబంధంగా రాష్ట్ర ఘన వ్యర్థాల నిర్వహణ సమితి పనిచేస్తుందన్నారు. విజయవాడలోని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఎస్ఇ సుబ్బారావు, నెల్లూరులోని ఆ సంస్థ మేనేజర్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అమ్మకి కన్నీటి నివాళి...

అమ్మంటే అనురాగం | అమ్మంటే ఆత్మీయత
అమ్మంటే ఆప్యాయత | అమ్మంటే ఒక దేవత!



శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారు

జననం : 16.10.1930 మరణం : 20.07.2019

SMD HOMES
Bangalore | Nellore

# గూడూరు డివిజన్ వార్తలు

## స్ఫూర్తిప్రదాత.. డా.ఏపిజె అబ్దుల్‌కలాం

**- జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి**




అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి

భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపిజె అబ్దుల్‌కలాం స్ఫూర్తి ప్రదాత అని, ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి కొనియాడారు. చిల్లకూరు మండలపరిధిలోని డానియల్ చిల్డ్రన్స్‌హోంలో జూలై 27న అబ్దుల్‌కలాం 4వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొని అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనాథ విద్యార్థులకు విద్యాసామగ్రిని, ఆరోగ్యసంబంధిత సామగ్రిని ఆయన అందజేశారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం మహోన్నతవ్యక్తి అని, రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా అబ్దుల్‌కలాం దేశానికి అందించిన సేవలు అమోఘమని.. మార్గదర్శకమని అన్నారు. విద్యకు పేదరికం అడ్డు కాదని, విద్యార్థులు పట్టుదలతో క్రమశిక్షణతో చదువుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. అబ్దుల్‌కలాం ట్రస్ట్ ప్రతినిధులు తాజుద్దీన్, అరవ పార్వతయ్య పాల్గొని మాట్లాడారు. సబ్‌జైలు అధికారి శ్రీనివాసరెడ్డి, గూడూరు గ్రామీణ సిఐ రామకృష్ణారెడ్డి, న్యాయవాది పసుపులేటి భాస్కర్, చేవూరు విజయమోహన్‌రెడ్డి, మయూరి శ్యాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎవరెస్ట్ అంత ఎత్తు ఎదగాలి

### పర్వతారోహకుడు సూర్యప్రకాశ్‌కు ఆదాల అభినందనలు



సూర్యప్రకాశ్‌కు చెక్కును అందజేస్తున్న ఎంపి ఆదాల, సుధాకర్‌యాదవ్

చిన్నవయసులో ప్రపంచంలోనే ఎత్తైన పర్వతాలను అధిరోహించిన నెల్లూరీయుడు కోరికల సూర్యప్రకాశ్‌ను నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి జూలై29వతేదీ నెల్లూరు లోని తన నివాసగృహంలో సత్కరించారు. ప్రపంచంలోనే ఎత్తైన పర్వతాలను అధిరోహించిన సూర్యప్రకాశ్ కీర్తిప్రతిష్టల పరంగా ఎవరెస్ట్ అంత ఎత్తు ఎదగాలని ఈ సందర్భంగా ఆదాల ఆకాంక్షించారు. పర్వతారోహణలో అందరి రికార్డులను బద్దలు కొడుతూ నెల్లూరుజిల్లా కీర్తిని ప్రపంచానికి చాటాలన్నారు.

పర్వతారోహకుడు సూర్యప్రకాశ్ ఈ సందర్భంగా తనకు ఎంతో ప్రోత్సాహన్నిచ్చి తన ఎదుగుదలకు వెన్ను తట్టిన ఆదాల ప్రభాకర్‌రెడ్డికి, ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం ఛైర్మెన్ సుధాకర్ యాదవ్‌కు, స్వర్ణ వెంకయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ యాదవ్ అందించిన పదివేల రూపాయల చెక్కును ఆదాల తన చేతుల మీదుగా సూర్యప్రకాశ్‌కు బహుకరించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పాముల హరి, డాక్టర్ సునీల్, అవినాష్, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

## సిలికాను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

**- హెచ్చరించిన డిఎస్పీ**






స్వాధీనం చేసుకున్న సిలికా లారీల వివరాలను వెల్లడిస్తున్న డిఎస్పీ శ్రీభవాని హర్ష, సిఐ రామకృష్ణారెడ్డి

ప్రభుత్వ నియమనిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా సిలికాను అక్రమంగా తరలిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని గూడూరు డిఎస్పీ శ్రీభవాని హర్ష హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని డిఎస్పీ కార్యాలయంలో జూలై 28న నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గూడూరు డివిజన్‌లోని చిల్లకూరు, కోట ప్రాంతాల్లో సిలికాను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం తెలియగానే గ్రామీణ సిఐ కె.రామకృష్ణారెడ్డి, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో చిల్లకూరు ప్రాంతం నుంచి ఇతరప్రాంతాలకు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 6 సిలికా లారీలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అంతేకాక, గుట్కాలు, ఇతర నిషేధిత పదార్థాల విక్రయాలపై దాడులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీ, సిఐలతో పాటు పలువురు ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## హోటళ్ళలో కమిషనర్ తనిఖీలు



జిల్లాకలెక్టర్ ఆదేశాల మేరకు గత నెల 27వ తేదీ మధ్యాహ్నం గూడూరు పురపాలకసంఘం కమిషనర్ ఓబులేశు పట్టణంలోని పలు హోటళ్ళలో తనిఖీలు చేపట్టారు. జూలై 26న నెల్లూరులోని పలు హోటళ్ళలో నిల్వచేసిన ఆహారం పట్టుబడడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. హోటళ్ళలోని వంటగదులను పరిశీలించారు. అక్కడ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో నిర్వాహకులపై మండిపడ్డారు. నిల్వచేసిన ఆహారపదార్థాలను విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఇస్కాన్ ఆధ్వర్యంలో..

## నేత్రపర్వంగా జగన్నాథుని రథయాత్ర



రథంపై కొలువుదీరిన జగన్నాథుడు, సుభద్ర, బలరాములు.

గూడూరు పట్టణంలోని ఇస్కాన్ మందిరం ఆధ్వర్యంలో జూలై 27వ తేదీన సాయంత్రం జగన్నాథుని రథయాత్ర నేత్రపర్వంగా జరిగింది. స్థానిక నారాయణమ్మ గుడివద్ద నుంచి ప్రారంభమైన రథోత్సవం పుర వీధుల మీదుగా సాగుతూ డిఎన్‌ఆర్ కమ్యూనిటీహాల్‌కు చేరుకుంది. తొలుత ప్రారంభ కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాద్‌రావు, మునిసిపల్ మాజీ ఛైర్మెన్ పొణకా దేవసేన, ఎం.వి.రావు, శ్రీలక్ష్మి పాల్గొని రథానికి పూజలు చేశారు. అనంతరం జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని హరేరామ హరేకృష్ణ నామస్మరణలు చేశారు. పాటలు పాడుతూ కోలాటాలను ప్రదర్శించారు. ఆ తర్వాత నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. పట్టణ సిఐ దశరథరామారావు, ఎస్ఐలు బ్రహ్మనాయుడు, సైదులు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

### పోలీస్‌స్టేషన్‌కు

## వాటర్‌కూలర్ వితరణ



సిఐ దశరథరామారావుకు వాటర్‌కూలర్‌నందజేస్తున్న డా.సి.జనార్దన్‌రెడ్డి

గూడూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు స్థానిక సిఆర్‌రెడ్డి హాస్పిటల్ తరఫున ప్రముఖవైద్యుడు సి.జనార్దన్‌రెడ్డి వాటర్‌కూలర్‌ను వితరణగా అందజేశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలకు దాహార్తి తీర్చడం కోసం 10వేలరూపాయలు విలువజేసే ఈ వాటర్‌కూలర్‌ను అందజేసినట్లు ఆయన తెలిపారు. సిఐ జి.దశరథరామారావు మాట్లాడుతూ గూడూరులోని డాక్టర్ సిఆర్‌రెడ్డి ఆసుపత్రి వారు పేదప్రజలకు ఉచితంగా వైద్యసేవలను అందిస్తూ తమ వితరణగుణాన్ని చాటుకుంటున్నారని అంటూ డాక్టర్ జనార్దన్‌రెడ్డిని అభినందించారు. డాక్టర్ సి.రోహిణి, ఆంధ్ర మహిళామండలి, ఇన్నర్‌వీల్‌క్లబ్‌ల వారు తమ సేవాభావంతో ప్రజలకు తమ సేవలందిస్తున్నారని కొనియాడారు.

### ఆహార నియమాలు పాటిస్తే..

## వ్యాధులు దూరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బిందుమీనన్, పక్కన రియాజ్ అహ్మద్, చంద్రశేఖర్ తదితరులు

ప్రస్తుత యాంత్రికప్రపంచంలో జీవనశైలి మారిపోతోందని, ప్రతిఒక్కరూ నిర్ణీతమైన విధానాలతో ఆహారనియమాలను పాటించడం ద్వారా వ్యాధులను దూరం చేసుకోవచ్చని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ బిందుమీనన్ (నెల్లూరు) అన్నారు. గూడూరులోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వ్యాయామం, యోగా, ధ్యానంతో మానసిక, శారీరక ఒత్తిడులను అధిగమించవచ్చన్నారు. ఈ సందర్భంగాల పలు వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులు షేక్ రియాజ్ అహమ్మద్, కడివేటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గల్పిక

# రాహుల్ రాజీనామాతో బీజేపీ నేతల్లో టెన్షన్

అది కాలుష్య రహిత నగరంగా ఐక్యరాజ్య సమితి నుండి ఐఎస్ఓ 9000–2020 సర్టిఫికెట్ పొందిన ఢిల్లీ నగరం. బీజేపీ ప్రధాన కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోడీతో పాటు ఆ పార్టీ నాయకులు అమిత్‌షా, జెపి నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, అరుణ్‌జైట్లీ, నిర్మలా సీతారామన్, స్మృతి ఇరాని, పీయూష్ గోయెల్ తదితరులున్నారు. అందరిలోనూ ఏదో తెలియని ఆందోళన. నరేంద్రమోడీ వుండి... ఏమైందంటూ అమిత్‌షాను ప్రశ్నించాడు. ఇంకా ఏమీ కాలేదు సార్, అతనింకా రాజీనామాను ఉపసంహరించుకోలేదు. వాళ్ల పార్టీలో కూడా రాజీనామాను ఉపసంహరించుకోండని ఎవరూ పెద్దగా ఒత్తిడి చేయడం లేదు. ఇదే చాలా విచిత్రంగా వుంది. వాస్తవంగా అయితే వాళ్ళ కుటుంబసభ్యులెవరైనా ఇలా రాజీనామాలు చేసి నప్పుడు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రోడ్ల మీద చేరి ఆందోళనలు చేస్తారు. బస్సులు, రైళ్లు, వీలైతే జనాలను కూడా తగలబెడుతుంటారు. దేశమంతా బంద్‌లు చేస్తుంటారు. వాళ్ల ఇంటి ముందు చేరి మీ నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే తుపాకీతో కాల్చుకుని చచ్చిపోతామని రివాల్వర్‌లు తలకు గురిపెట్టుకుని బెదిరిస్తుంటారు. అదేం విచిత్రమో... వాళ్ళమ్మ విషయంలో జరిగిన ఇలాంటి సంఘటనలు ఇతని విషయంలో జరగడం లేదు. ఇక్కడే ఏదో సందేహం కలుగుతుందన్నాడు. అప్పుడు మోడీ అమిత్‌షాతో... చూడు షా... కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు. కాలంతో పాటు అన్నీ మారుతుంటాయి. మన పార్టీయే చూడు... 20ఏళ్ల క్రితం ఒక్క ఓటు తేడాతో పెద్దాయన వాజ్‌పేయి ప్రభుత్వాన్నే పోగొట్టుకున్నాడు. ఇప్పుడు మనం అవతల మెజార్టీ వున్న ప్రభుత్వాలను కూడా కుప్పకూల్చి అధికారంలోకి వస్తున్నాం. అలాగే ఆ పార్టీలో పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా వుండవు. అప్పట్లో ఆ పార్టీ కార్యకర్తలలో వున్న ఉత్సాహం ఇప్పుడుండదు. అప్పుడంటే ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది కాబట్టి మీరు ప్రధాని పదవి చేపట్టకుంటే నేను కాల్చుకుని చస్తానంటూ తలకు తుపాకీ గురిపెట్టుకుంటారు. ఇప్పుడు ఆ పార్టీ అధికారంలో లేదు. తలకు తుపాకీ కాదు కదా గుండుసూదితో కూడా గుచ్చుకుంటానని బెదిరించేవాడు వుండడు. పార్టీలో ఈ విధమైన ఒత్తిడి రాకపోతే అతను రాజీనామాను వెనక్కి తీసుకోడు. అతను తీసుకోకపోతే మన కలలను సాధించకోలేం అని చెప్పాడు. మరిప్పుడేం చేయమంటారని అమిత్‌షా అడిగాడు. అప్పుడు మోడీ అమిత్‌షా చెవిని దగ్గరకు లాక్కొని గుసగుస అంటూ ఏదో చెప్పేశాడు.

★★★★★

ఢిల్లీలోని టెన్‌జనపథ్. సోనియా గాంధీ, అంబికాసోని, అహ్మద్‌పటేల్, గులాంనబీ ఆజాద్, మనీష్ తివారీలు హాల్‌లో దిగాలుగా కూర్చుని వున్నారు. అప్పుడే రాహుల్‌గాంధీ సైకిల్‌ను రెండు చేతులతో పైకెత్తి మోసుకుంటూ లోపలకు వచ్చాడు. అది చూసి సోనియా... ఈ తింగరోడు రోజుకో విన్యాసం చేస్తున్నాడు. అసలివి మాత్రం చేయడం లేదని మనసులో అనుకుంటూ... ఏం రాహుల్, సైకిలేమన్నా పంక్చరయ్యిందా, అలా పైకెత్తుకుని తెస్తున్నావని అడిగింది. దానికి రాహుల్... లేదమ్మా, సైకిల్‌ను నేనెక్కి తొక్కితే గంటకు 200 కేలరీలే కరుగుతాయంట... అదే సైకిల్‌ను నేనెత్తుకుని తిరిగితే గంటకు 400 కేలరీలు కరుగుతాయట... అందుకే ఈ ఎక్సర్‌సైజ్ మొదలుపెట్టాను అని చెప్పాడు. ఆ మాటకు సోనియాగాంధీ తల కొట్టుకోవడం ఒక్కటే తక్కువైంది. తర్వాత రాహుల్ వుండి... ఏం అందరూ ముఖాలు అలా వాడిపోయిన వంకాయల్లా పెట్టుకుని వున్నారని అడిగాడు. అహ్మద్ పటేల్ అందుకు... కర్నాటకలో మన సంకీర్ణ ప్రభుత్వం పడిపోయింది బాబూ అని అన్నాడు. దానికి సంతోషించాలి గాని దిగులు పడతారెందుకు అని రాహుల్ ప్రశ్నించాడు. ఆ మాటతో అందరూ హతాశులయ్యారు. గులాంనబీ ఆజాద్ తేరుకుని... ఏంటి రాహుల్ అలా మాట్లాడుతావ్, మన భాగస్వామ్య ప్రభుత్వం కూలిపోతే మనకు బాధగా వుండదా అని అడిగాడు. అందుకు రాహుల్... “పెరుగుట విరుగుట కొరకే” అని పెద్దలు వూరికే చెప్పలేదు. ఒకప్పుడు మన కాంగ్రెస్ దేశమంతటా వుండింది. మనం అంతగా పెరిగాం... ఇప్పుడు విరిగిపోయి నాలుగైదు రాష్ట్రాల్లో మాత్రమే వున్నాం. బీజేపీని కూడా అలాగే పెరగనిద్దాం. అన్ని రాష్ట్రాల్లో అధికారం చేపట్టనీయండి. ఆ తర్వాత ప్రజలే వారిని తరిమికొడతారు. మళ్ళీ మనకు టైం వస్తుంది. సినిమాలలో యాక్టర్‌లు సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టినట్లే దేశ రాజకీయ చరిత్రలో మన పార్టీ కూడా సెకండ్ ఇన్నింగ్స్ మొదలుపెడుతుంది... అని చెప్పాడు. రాహుల్ చెప్పిన దాంట్లో నిజముందనిపించింది... కాకపోతే పెరిగితే విరిగిపోవడానికి అది కాంగ్రెస్ కాదు, బీజేపీ అనే ఒక అనుమానం వారి మనసుల్లో బలంగా వుండిపోయింది.

వీళ్ళ మధ్య ఇలా చర్చలు జరుగుతుండగానే టెన్‌జనపథ్ బయట పెద్ద ఎత్తున కేకలు... హడావిడి. ఆ అరుపులతో లోపలవున్న వీళ్ళంతా బయటకు వచ్చారు. అక్కడచూస్తే ఒకడు తలకు తుపాకీ గురిపెట్టుకుని వున్నాడు. ఇంకోడు కిరసనాయిల్ డబ్బా పట్టుకుని వున్నాడు. వందల సంఖ్యలో జనం అక్కడ గుమికూడి వున్నారు. ఏఐసిసి అధ్యక్ష పదవికి చేసిన రాజీనామాను రాహుల్‌గాంధీ వెంటనే ఉపసంహరించుకోవాలి. లేదంటే మేం కాల్చుకుని చచ్చిపోతామని వాళ్లు బెదిరించసాగారు. అక్కడకొచ్చిన కార్యకర్తలైతే... రాహుల్ రాజీనామాను ఉపసంహరించుకునే దాకా మేం ఇక్కడే కూర్చుంటాం... మాకు తిండి వద్దు, నీళ్ళు వద్దు... చావనైనా చస్తాం అంటూ అక్కడే బైఠాయించారు. రాహుల్ పట్ల వాళ్ళు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు సోనియా గాంధీ కళ్ల వెంట నీళ్ళు తిరగసాగాయి. ఆమె పక్కనే వున్న అంబికాసోనితో... ఈ దేశ ప్రజలకు మా కుటుంబం పట్ల ఏ మాత్రం అభిమానం తగ్గలేదు. కాని మేమెందుకు ఓడిపోతున్నామో అర్థం కావడం లేదు అని అంది. అప్పుడే మల్లిఖార్జున ఖర్గే అక్కడకు వచ్చాడు. రావడం తోటే.. మీకు ఎప్పటికీ ఇలాంటివి అర్థం కావులేండి... ముందు అక్కడ ఆందోళన చేస్తున్నవారి చేతులు చూడండి అని చెప్పాడు. సోనియా వాళ్ళ చేతులు చూసింది. దాదాపు అందరి చేతులకు కాషాయ దారాలు కట్టి వున్నాయి. ఏం జరిగింది అని సోనియా అడిగింది. అప్పుడు మల్లిఖార్జున ఖర్గే... వీళ్లంతా మన కార్యకర్తలు కాదు, బీజేపీ కార్యకర్తలు. ఏఐసిసి అధ్యక్ష పదవికి రాహుల్ గాంధీ రాజీనామా చేశాడు కదా... మన పార్టీలో మీ కుటుంబం పట్ల వున్న భక్తి విశ్వాసాల ప్రకారం అయితే కాంగ్రెస్ కార్యకర్తలు మీ ఇంటి ముందు చేరి రాజీనామాను వెనక్కి తీసుకోండంటూ ధర్నాలు చేయాలి, చస్తామని బెదిరించాలి. కాని రాహుల్ రాజీనామా చేశాక అలాంటివేమీ జరగలేదు. మనం మళ్ళీ కూడా అధికారంలోకి రాలేదు కాబట్టి మీ కుటుంబ భక్తులు నీరస పడిపోయినట్లున్నారు... ఇలాంటి ఆందోళనలు చేయకపోతే ఎక్కడ రాహుల్‌గాంధీ రాజీనామాను ఆమోదిస్తారో, ఎవరు కాంగ్రెస్ కొత్త అధ్యక్షుడవుతాడోననే భయంతోనే బీజేపీ నాయకులు వాళ్ల పార్టీ కార్యకర్తలను మన పార్టీ కార్యకర్తల మాదిరిగా పంపించి ఇక్కడ ఆందోళనలు చేయిస్తున్నారు. వాళ్ళు జెండాలైతే మార్చుకుని వచ్చారు గాని, చేతికి వున్న ఆ కాషాయం దారాలను మాత్రం తీసి పక్కనపెట్టి రాలేకపోయారు. దటీజ్ బీజేపీ వాలంటీర్స్... అని చెప్పాడు. ఇలా చేయడం వల్ల వాళ్ళకేం లాభం అని సోనియా అడిగింది. దానికి ఖర్గే... రాహుల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వుంటే ‘కాంగ్రెస్ ముక్త్ భారత్’ అంటూ తామిచ్చిన పిలుపు త్వరలోనే సాకారం అవుతుందని నరేంద్ర మోడీ, అమిత్‌షాల ఆశ. ఆయన అధ్యక్షుడిగా వుండబట్టే తమ పార్టీ బంపర్ మెజార్టీతో రెండోసారి కూడా అధికారంలోకి వచ్చిందన్నది వారి సెంటిమెంట్... కాబట్టే కలకాలం రాహులే కాంగ్రెస్ అధ్యక్షుడిగా వుండాలని వారు కోరుకుంటున్నారని చెప్పేసరికి సోనియా... ఔరా.. అంటూ నోరెళ్ల బెట్టింది.!

## అభివృద్ధి పనులకు సహకరించాలి

**- అధికారులతో ఎమ్మెల్యే మేకపాటి**

ఉదయగిరి నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులకు అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. జూలై 27న ఉదయగిరిలోని అతిథి గృహంలో నియోజకవర్గస్థాయిలోని వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని, ఎంపీడీఓలు వెంటనే ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అవసరమైతే ట్యాంకర్ల సంఖ్యను పెంచి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో పారిశుద్ధ్య పరిస్థితులు దిగజారే అవకాశం ఉందని గ్రామాల్లో ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన వాలెంటరీ వ్యవస్థ గురించి చర్చించారు. ఆగస్టు15 నుంచి అమలులోకి వచ్చే కొత్త విధానంలో వాలెంటీర్ల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని, సరుకులు లబ్దిదారుల ఇళ్ళకు చేరేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక సహకార సంఘాలకు కాలపరిమితి ముగిసినందున వారి స్థానంలో నామినేటెడ్ పద్ధతిలో పాలకవర్గాన్ని నియమించే విధానంపై సొసైటీ అధికారులకు సూచనలిచ్చారు. వెలుగు, ఇంజినీరింగ్, వైద్య, ఆరోగ్యం అంశాలపై అధికారులతో చర్చించారు.

## ఆర్టీసీ విలీనంతో కష్టాలు దూరం

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంతో ఉద్యోగులు, కార్మికుల కష్టాలు తీరనున్నాయని, అందుకుగాను సీఎం జగన్మోహన్‌రెడ్డికి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు రుణపడి వున్నారని వైయస్సార్ ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి పేర్కొన్నారు. జూలై 27న నెల్లూరు, ఆర్టీసీ ప్రధాన బస్టాండ్ ఆవరణంలో యూనియన్ నాయకులు, కార్మికులతో మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, యాజమాన్యాల ఏకపక్ష నిర్ణయాలతో సంస్థ నష్టాల ఊబిలో కూరుకుపోయిందని ఆరోపించారు. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలి కేబినెట్ సమావేశంలోనే ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనానికి చర్యలు చేపట్టారని తెలిపారు. అనంతరం ఇటీవల నూతనంగా ఎన్నికైన నెల్లూరు ఒకటో డిపో గ్యారేజీ కమిటీని ఒకటో డిపో మేనేజర్ విశ్వనాథ్‌కు పరిచయం చేశారు. యూనియన్ రీజినల్ కార్యదర్శి వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.



కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కావలి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

### కావలిలో...

## అబ్దుల్‌కలాం వర్ధంతి

కావలిలోని అభ్యుదయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జూలై 27న ఏపిజె అబ్దుల్‌కలాం 4వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ అంబేద్కర్ ప్రైమరీ స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కావలి మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, జిల్లా రెడ్‌క్రాస్ కార్యవర్గసభ్యుడు గంధం ప్రసన్నాంజనేయులు, మొగల్ సలీ బేగ్, అబ్దుల్లా, సంయుక్త సేవాసంస్థ సురేంద్ర తదితరులు పాల్గొని అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అబ్దుల్ కలాం దేశానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమైనవని కొనియాడారు. ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు సురేష్, మస్తాన్, జావీద్, ఖాజా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### డిఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో..

## సరుకులు పంపిణీ




వృద్ధురాలికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న డిఆర్ విశ్వోదయ సేవాసమితి సభ్యులు

కావలి వెంగళరావునగర్‌లోని డిఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో గత నెల 28న సుమారు 60మంది లబ్దిదారులకు ఉచితంగా నెలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ వై.సుమన్ మాట్లాడుతూ సమాజానికి తనవంతు సేవలందిస్తున్న డిఆర్ సేవాసమితి వారిని అభినందించారు. మాజీ కౌన్సిలర్ గంధం ప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఒక సేవాభాగ్యమని అన్నారు. గత 35ఏళ్ళుగా ఈ సేవాసమితి సేవాకార్యక్రమాలు చేస్తూనే ఉందంటూ, ఎంతో ముందుచూపుతో డిఆర్ గారు సమాజంపట్ల తన సేవాభిమానాన్ని చాటుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి డైరెక్టర్లు దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, శ్రీమతి లక్ష్మి, కె.తాతిరెడ్డిలతో పాటు సభ్యులు జె.కృష్ణప్రసాద్, నల్లూరు రామకృష్ణ, జ్యోతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



ముని కుటుంబసభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న శ్రీమతి ప్రశాంతిరెడ్డి

# వేమిరెడ్డికి కలెక్టర్ ధన్యవాదాలు

ప్రముఖ పారిశ్రామిక వేత్త, దానశీలి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి జిల్లా కలెక్టర్ యంవీ శేషగిరిబాబు గతనెల 29న ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరు జిల్లా నాయుడుపేట మండలం పుదూరు గ్రామానికి చెందిన నాయుడుప్రసాద్ కుమార్తె మునికి గుండె ఆపరేషన్‌కు సంబంధించి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తనవంతు సహాయంగా రూ. 3లక్షలు ఆర్థిక సహాయాన్ని తన సతీమణి, విపిఆర్ ఫౌండేషన్ కో–ఛైర్మెన్ శ్రీమతి ప్రశాంతిరెడ్డి ద్వారా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

# చదువుకు పెద్దపీట

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రూ.1500 కోట్లు మంజూరు - ఎమ్మెల్యే ప్రసన్న



ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 1500 కోట్లు మంజూరు చేసిందని, కేంద్రం కూడా ఇందుకు నిధులిస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తెలిపారు. జూలై 27న కొడవలూరు, గండవరం, యల్లాయపాళెం, నార్తురాజుపాళెం ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థినులకు ఆయన సైకిళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొడవలూరులో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం, కేంద్రం మంజూరు చేసిన ఈ నిధులతో ఆగస్టు నెలలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఏ ఒక్క బిడ్డ చదువుకునే వయస్సులో పనికి వెళ్ళడం జరక్కూడదని భావించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమ్మఒడి పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. విద్యను ప్రోత్సహించేందుకే తొలుత పదవ తరగతి వరకే అనుకున్నా... తర్వాత ఇంటర్మీడియట్ వరకు ఈ పథకం వర్తింపజేశారని తెలిపారు. కొడవలూరు, గండవరం, యల్లాయపాళెం, నార్తురాజుపాళెం ఉన్నత పాఠశాలలు, కొడవలూరు వసతి గృహాల్లో స్వచ్ఛమైన నీటిని అందించేందుకు రూ. 2 లక్షలు వంతున రూ. 10లక్షలు మంజూరు చేశారు. ప్రతి పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే అన్నంలో పురుగులు, నీళ్ళ సాంబారు, రసం వడ్డిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వీరందరికి వారం రోజులు గడువు ఇస్తామని, మారకపోతే ఏజెన్సీని తొలగిస్తామని హెచ్చరించారు. త్వరలోనే ప్రభుత్వం పాఠశాలలకు కూడా సన్న బియ్యం పంపిణీ చేయనుందని, దీంతో పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందనుందని భరోసా ఇచ్చారు. వైయస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి నాపా వెంకటేశ్వర్లు నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసులు, తహశీల్దార్ వి.లావణ్య, ఎంపీడీఓ జ్యోతి, ఎంఈఓ వసంత కుమారి, ఏపీయం రుక్మిణీ, హెచ్ ఎంలు ఇందిరాదేవి, చెన్నారాయుడు, పి.జయరాజ్, లక్ష్మీ ప్రసూన పాల్గొన్నారు.

# అన్నదాతల సేవలో తరించాం

- ముగిసిన డిసిసిబి పాలకవర్గం పదవీకాలం
- ఆత్మీయ సమావేశంలో ఛైర్మెన్ ధనుంజయరెడ్డికి సత్కారం



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయరెడ్డి

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గ పదవీ కాలం జూలై 31వ తేదీతో ముగిసింది. వాస్తవానికి 18 నెలల క్రితమే ఈ పాలకవర్గం పదవీకాలం ముగిసినప్పటికీ, గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఆరేసి నెలల పాటు మూడు దఫాలుగా పదవీకాలాన్ని పొడిగించడంతో ఆ గడువు ఇప్పటిదాకా వచ్చింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం మరోసారి పాలకవర్గాల గడువును పొడిగించలేదు. వీటి స్థానంలో త్రిసభ్య కమిటీలను నియమించాలనుకుంటోంది.

ఇక గత పాలకవర్గం ఛైర్మెన్‌గా మెట్టుకూరు ధనుంజయరెడ్డి 6ఏళ్ల 8 నెలల పాటు ఈ పదవిలో కొనసాగారు. డిసిసిబి ఛైర్మెన్‌గా ఎక్కువ కాలం పదవిలో కొనసాగిన వారిలో మూడో వాడిగా నిలిచాడు. అంతేకాదు, కేంద్ర సహకార బ్యాంకు పురోభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేసిన వారిలో ఒకడయ్యాడు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకును ఆధునీకరణ బాట పట్టించాడు. బ్యాంకు శాఖలను కంప్యూటరైజ్ చేయించాడు. మొబైల్ ఏటిఎంలు పెట్టించాడు. రైతులకు ఏటిఎం కార్డులు, రూపే కార్డులు అందించాడు. రైతులకు వ్యక్తిగత బీమా సదుపాయాన్ని కల్పించాడు. సహకార బ్యాంకు ఉద్యోగులకు పింఛన్ సదుపాయాన్ని కల్పించడమే కాకుండా వారి ఉద్యోగ విరమణ వయసును 58 నుండి 60ఏళ్ళకు పెంచుతూ పాలకవర్గం ద్వారా తీర్మానం చేయించి ఆమోదింపచేసుకున్నాడు. కారుణ్య ఉద్యోగుల నియామకాలలో ఎంతో పారదర్శకంగా, మానవత్వంతో వ్యవహరించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా తన పాలనాకాలంలో 80మందికి ఉద్యోగాలు కల్పించారు. ఆయన హయాంలోనే జిల్లాలో ఎన్నో సొసైటీలకు సొంత భవనాలు ఏర్పడ్డాయి. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు భవనాలు సైతం ఆధునీకరించబడ్డాయి. రైతుల సంక్షేమం కోసం బ్యాంకు ద్వారా ఎన్నో పథకాలకు రూపకల్పన చేశారు. నష్టాల్లో వున్న బ్యాంకును లాభాల బాట పట్టించడమేకాక డిపాజిట్లను 87 కోట్ల నుండి 260కోట్లకు తీసుకెళ్లారు. 339 కోట్ల వ్యాపారాన్ని తన హయాంలో 973కోట్లకు తీసుకెళ్లగలిగారు. 2018లో బ్యాంకు శతవర్ష వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించారు.

ఛైర్మెన్‌గా బ్యాంకు పురోభివృద్ధికి ఎంతో కృషి చేసిన ధనుంజయరెడ్డిని గత నెల 28వ తేదీన బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాలకవర్గ సభ్యులు, బ్యాంకు అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ధనుంజయరెడ్డి మాట్లాడుతూ పదవీకాలం ముగిసినందుకు ఏ మాత్రం బాధలేదని, 6ఏళ్ల 8 నెలల పాటు రైతులకు సేవచేసే అవకాశం కలిగినందుకు ఒక రైతు బిడ్డగా తనకు అంతకంటే అదృష్టం లేదని పేర్కొన్నాడు.

### 5 లక్షల నుండి..

# కోటి 50 లక్షలకు తీసుకెళ్లాం!

## డిసిఎంఎస్ ఛైర్మెన్ సుమంత్



ఆత్మీయ సత్కారాన్నందుకుంటున్న వై.సుమంత్‌రెడ్డి

తాము పగ్గాలు చేపట్టేనాటికి కేవలం 5లక్షల రూపాయలు మాత్రమే ఋణాలుగా ఇచ్చి వున్న జిల్లా సహకార పరపతి సంఘాన్ని కోటి 50లక్షల రూపాయల ఋణాలు ఇచ్చే స్థాయికి తీసుకెళ్లామని ఆ సంఘం ఛైర్మెన్ వై.సుమంత్‌రెడ్డి పేర్కొన్నారు. జూలై 29వ తేదీకి జిల్లా సహకార పరపతి సంఘం పాలకవర్గం ముగిసింది. దీనికి ముందుగా విడవలూరు మండలం వరిణి సొసైటీలో పాలకవర్గం అధ్యక్షులు సుమంత్‌రెడ్డికి ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమంత్‌రెడ్డి మాట్లాడుతూ 2012లో తాను వచ్చేనాటికి ఈ సొసైటీ ఎంతో అధ్వాన్నస్థితిలో వుండిందని, చిత్తశుద్ధితో శ్రమించి ఈరోజు అన్ని విధాలా పటిష్ఠ స్థితిలో వుంచామన్నారు. జిల్లాలో అత్యధికంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి అటు రైతులకు సహకరించడంతో పాటు ఇటు సంఘం పురోభివృద్ధికి పాటుపడ్డామన్నారు. యూరియా కొరత వున్నప్పుడు కూడా రైతులకు సొసైటీ ద్వారా యూరియాను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.






### ప్రభుత్వాసుపత్రిలో...

# అన్న ప్రసాద వితరణ



ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై నెలలో జన్మదినం జరుపుకున్న వాకర్స్ సభ్యుల సహకారంతో నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు సహాయకులుగా ఉన్న వారికి గతనెల30న అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సేవా ట్రస్ట్ సహకారంతో దాదాపు 300 మందికి అన్న సంతర్పణ చేశారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం మిన్న అని, ఇలాంటి కార్యక్రమాలు ప్రతి నెల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి వినుకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు జీవీ కృష్ణయ్య, ఎన్.సాయి సుబ్బారావు, కార్యనిర్వాహక సభ్యులు కోదండరామయ్య, యం. పిచ్చయ్య, కృష్ణారెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పసిబిడ్డలకు పెట్టే అన్నం..
# దేవుని ప్రసాదంతో సమానం

**కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి**



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

పసిబిడ్డలకు పెట్టే అన్నం దేవుని ప్రసాదంతో సమానమని, తల్లి తన బిడ్డలకు ఎలా అన్నం ఆప్యాయంగా పెడుతుందో అదేవిధంగా పాఠశాలల్లో చదువుకునే పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌ఛార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. జులై 30న ఆయన రూరల్ పరిధిలోని పెనుబర్తిలో జడ్పీ హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేసి, వంటగదిని పరిశీలించారు. అక్కడ భోజనం తయారు చేసేవారితో మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మెనూను సక్రమంగా అమలు చేసి విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులను, తల్లిదండ్రులను మధ్యాహ్న భోజన సదుపాయం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. భోజన సదుపాయం కలిగించే విషయంలో సమస్యలేమైనా ఉన్నా వెంటనే వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. ఇక్కడ భోజనం బాగుందని ఆ స్కూల్ హెడ్‌మాస్టర్‌ను, ఉపాధ్యాయులను, మధ్యాహ్న భోజనం నిర్వాహకులను ఆయన అభినందించారు.

# గుట్కాలపై పోలీసుల పంజా

## రూ.10 లక్షలు విలువచేసే గుట్కాలు స్వాధీనం

నెల్లూరు షార్ కాలనీలో గత నెల 29 రాత్రి ఓ ఇంట్లో తనిఖీలు చేసి రూ.10 లక్షలు విలువ చేసే గుట్కాలను వేదాయపాళెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా 30వ తేది వేదాయపాళెం పోలీస్‌స్టేషన్లో నగర డీఎస్పీ జె. శ్రీనివాసులురెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ ఉదయగిరి మండలం గండిపాలెం గ్రామానికి చెందిన కె. మహేంద్రబాబు అలియాస్ మహేంద్ర నెల్లూరు బీవీనగర్‌లోని షార్ కాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని కర్నాటక రాష్ట్రం బెంగళూరు కెకె మార్కెట్ నుంచి గుట్కాలు, ఖైనీలు దిగుమతి చేసుకుని వాటిని నెల్లూరు నగరంతో పాటు పలు ప్రాంతాల్లోని వ్యాపారులకు విక్రయించేవాడు. ఈ క్రమంలో పడారుపల్లి శిరోమణి నగర్‌కు చెందిన డి.సునీల్‌కుమార్‌తో అతనికి పరిచయం ఏర్పడి ఇద్దరు కలిసి గుట్కాల వ్యాపారం చేయసాగారు. వారి కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు 29 రాత్రి షార్ కాలనీలోని ఓ ఇంటి వద్ద నుంచి గుట్కాలు తరలిస్తున్నారన్న సమాచారంతో వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ టివి సుబ్బారావు తన సిబ్బందితో కలిసి ఆ ఇంటిపై దాడి చేసి మహేంద్ర, సునీల్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. రూ.10 లక్షలు విలువ చేసే గుట్కాలను, నిషేధిత ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్ట్ చేసేందుకు కృషి చేసిన ఇన్ స్పెక్టర్ టివి సుబ్బారావు, ఎస్సై ఎం.పుల్లారెడ్డి, క్రైం పార్టీ ఏఎస్ఐ ప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, పీసీలు గోపాలయ్య, జిలానీలను డీఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

# బీజేపీ వల?

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష నేత చంద్రబాబును అసమర్థుడిగా చూపడం... ఆ పార్టీ కేడర్‌నంతా తమ పార్టీలోకి లాక్కోవడం. ఏ రాష్ట్రంలోనైనా ఒక ప్రాంతీయ లేదా జాతీయ పార్టీ పూర్తిగా తెరమరుగైతే ఇంకో పార్టీ ఎదగడానికి అవకాశం వుంటుంది. ఇప్పుడు ఏపిలో కాంగ్రెస్ పూర్తిగా అంతరించిపోగా, తెలుగుదేశం క్రమంగా బలహీనపడుతోంది. కాబట్టి ఆ రెండు పార్టీల స్థానంలో వైసిపికి ప్రత్యామ్నాయంగా తాము ఎదగాలని బీజేపీ నేతల పన్నాగం. అందుకే అప్పుడే వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గేమ్ స్టార్ట్ చేశారు. టీడీపీ కేడర్‌ను తమ పార్టీలోకి లాక్కుంటున్నారు. ఏపిలో బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా మెగాస్టార్ చిరంజీవిని, ఆయన తమ్ముడు పవన్ కళ్యాణ్‌లను పార్టీలోకి తీసుకోవాలని భావిస్తున్నారని తెలుస్తోంది. రాష్ట్ర పార్టీ నాయకత్వం కూడా చిరంజీవికే అప్పగించేలా చర్చలు జరిగాయని, చిరంజీవిని ముందుపెడితే రాష్ట్రంలోని బలమైన కాపు సామాజిక వర్గం పార్టీ వెంట నడుస్తుందని, ప్రస్తుతానికి ఈ వర్గం అటు టిడిపికి ఇటు వైసిపికి కాకుండా పోయిందని బీజేపీ నేతల ఉద్దేశ్యం. అందుకే మెగాబ్రదర్స్‌ను ముందు పెట్టుకుంటే రాష్ట్రంలో పార్టీ తొందరగా విస్తరిస్తుందని బీజేపీ అధిష్టానం ఆలోచిస్తున్నట్లుగా సమాచారం.

# ఉత్తమనేత.. కన్నుమూత

## వైకల్యాన్ని అధిగమించి... ఆత్మవిశ్వాసంతో పురోగమించిన మహానేత... జైపాల్‌రెడ్డి



*ఇరవై ఆరేళ్ల యువప్రాయంలోనే శాసనసభ్యునిగా ఎన్నికై తన వాగ్ధాటితో అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసిన జైపాల్‌రెడ్డి... చిన్నతనంలోనే పోలియో సోకినా అత్యంత ఆత్మ విశ్వాసంతో చదువుకుంటూ..విజ్ఞానఖనిగా ఎదిగి.. రాజకీయరంగంలో ప్రవేశించి నాలుగు సార్లు అసెంబ్లీకి, ఏడుసార్లు పార్లమెంట్‌కు ఎన్నికై సీనియర్ కాంగ్రెస్ నాయకునిగా..అపర చాణుక్యునిగా రాణించిన ఎస్.జైపాల్‌రెడ్డి(77)...ఇక లేరు. గత కొద్దిరోజులుగా అస్వస్థతో హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్సపొందుతూ జులై 28 వేకువన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.*

జైపాల్‌రెడ్డి మాట వింటేనే.. అదరహో అంటారు జనం. చట్టసభల్లో ఆయన వాగ్ధాటిని చూసిన వారు, విన్నవారు జైపాల్‌రెడ్డి అంటేనే..ఆయనో గట్టి నాయకుడని గొప్పగా చెప్తుంటారు. రాజ్యసభ, లోక్‌సభల్లోనూ తన అద్భుతమైన వాక్చాతుర్యాన్ని ప్రదర్శించి అందరినీ ఆకట్టుకుంటూ, దేశానికి అవసరమైన ఎన్నో ప్రజోపయోగకరమైన కార్యాలను నిర్వర్తిస్తూ, రాష్ట్ర–కేంద్ర రాజకీయాల్లో తనకంటూ ఒక విశిష్టమైన ముద్ర వేసుకున్న మహోన్నత నేత ఆయన. ఎమ్మెల్యేగా, ఎంపీగా..కేంద్రమంత్రిగా.. ప్రతిపక్ష రాజకీయవేత్తగా జైపాల్‌రెడ్డి ఎక్కడ ఏ పదవిలో ఉన్నా ఆ పదవికే ఖ్యాతి తెచ్చారు. రాష్ట్రస్థాయిలోనే కాదు, జాతీయ అంతర్జాతీయస్థాయి విషయాలెన్నో ఆకళింపు చేసుకుని, జాతీయస్థాయి ఖ్యాతిని ఆర్జించారు. ఎక్కడో మారుమూల గ్రామంలో జన్మించినా.. బాధలతో జీవితం ప్రారంభించినా.. ఏ బాధల్నీ లెక్కచేయక, ధీరోదాత్తంగా ముందుకు సాగాడు. పుట్టిన ఒకటిన్నర ఏడాదిలోనే పోలియో సోకడం వల్ల సరిగా నడవలేని స్థితి ఏర్పడినా ఏమాత్రం వెరవక.. కర్రలు పట్టుకుని నడుస్తూ అత్యంత ఆత్మవిశ్వాసంతోనే అన్ని అవరోధాలను అధిగమించారు. జీవితంలో ఒక్కొక్క మెట్టూ ఎదుగుతూ రాజకీయాల్లోకి వచ్చి ఎన్నో ఉన్నతమైన పదవులు పొందారు. రాజ్యసభ సభ్యునిగా రెండుసార్లు ఎన్నికై ఎన్నెన్నో ప్రజాసమస్యలను కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చారు. అనేక జాతీయ అంతర్జాతీయ వేదికలపై భారతదేశ ప్రతినిధిగా నిలచి దేశ ఔన్నత్యాన్ని చాటారు. కేంద్ర రాజకీయాల్లోనూ కీలకంగా మారి 1997–98లో కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రిగా నూతన విధానాలకు శ్రీకారం చుట్టారు. ప్రసారభారతి చట్టాన్ని ప్రవేశపెట్టి దూరదర్శన్ స్వయంప్రతిపత్తికి బాటలు వేసిన ప్రజానేత కూడా ఆయనే. 2004లో కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రిగా, 2005లో కేంద్ర పట్టణాభివృద్ధి, సాంస్కృతిక శాఖ మంత్రిగా, 2011లో కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రిగా, 2012లో కేంద్ర శాస్త్ర సాంకేతికశాఖ మంత్రిగా ఎన్నో గురుతరమైన బాధ్యతలను, ఉన్నతమైన పదవులను అద్వితీయంగా నిర్వర్తించి ఆయన అందరి ప్రశంసలు అందుకున్నారు.

### అంచలంచలుగా ఎదిగి.. ఉన్నత శిఖరాలకు...

నల్గొండజిల్లాలోని నెర్మట అనే గ్రామంలో పుట్టి, రంగారెడ్డి జిల్లాలో పెరిగిన జైపాల్‌రెడ్డి ఎవరికీ తలవంచని ధీరునిగా ఎదిగారు. ముక్కుసూటి వ్యక్తిత్వం. అంచలంచలుగా ఎదిగి ఎం.ఏ ఇంగ్లీష్‌లో పట్టా పొంది రాష్ట్ర రాజకీయాల్లోనూ, కేంద్ర రాజకీయాల్లోనూ రాణించి ఎన్నో ఉన్నత శిఖరాలను అందుకున్నారు. కాంగ్రెస్ లోనూ, జనతాపార్టీలోనూ, జనతాదళ్ లోనూ పనిచేశారు. ఏఐసిసి అధికార ప్రతినిధిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యేగా వరుసగా నాలుగు సార్లు విజయం సాధించి రికార్డు సృష్టించారు. 1975లో దేశంలో ఇందిరాగాంధీ ఎమర్జన్సీ విధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీని వదిలేసి జనతా పార్టీలో చేరి ఆ పార్టీలో ఒక అగ్రనేతగా ప్రఖ్యాతిగాంచారు. ఆ తర్వాత రోజుల్లో ప్రత్యేకించి తెలంగాణ రాజకీయాల్లో ఆయన కీలకపాత్ర పోషించారు.

### అద్భుతమైన వాగ్ధాటి.. ఆయన సొంతం...

ప్రజాసమస్యలను చర్చించడంలో, విమర్శనాస్త్రాలను సంధించడంలో జైపాల్ రెడ్డి మహా దిట్ట. అద్భుతమైన వాగ్ధాటి.. ఆయన సొంతం. అవతలివారు ఎంత పెద్ద నాయకులైనా ఆయన ప్రశ్నలకు జవాబు చెప్పాలనుకుంటే ఎంతో కష్టసాధ్యంగా ఉండేది. అంతటి ప్రతిభాశాలి.. అద్వితీయమైన వక్త జైపాల్‌రెడ్డి. అసెంబ్లీలో ఉన్న సమయంలో జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు ఇద్దరూ ఒకే బెంచీలో కూర్చునేవారు. ఇక వీరి వాగ్ధాటితో అసెంబ్లీ అదిరిపోయేది. ఏదైనా చర్చ వచ్చిందంటే చాలు..వీరిద్దరూ ఏం మాట్లాడతారో'..వారి వాగ్ధాటిని వినాలని జనం ఎంతో ఆసక్తి చూపేవారు. 'నా జీవితమే ఒక పోరాటం.. నా వైకల్యాన్నే ఒక సవాల్‌గా తీసుకుని మెట్టు మెట్టు పైకెక్కా'..నంటూ సగర్వంగా చాటుకున్న ధీర దిగ్గజ నేత జైపాల్‌రెడ్డి.

ఆయన మృతి.. తెలుగుజాతికే తీరని లోటు. గత నెల 29న ఆయన భౌతిక కాయానికి హైదరాబాద్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. దేశంలోని ఎంతోమంది నేతలు, పెద్ద సంఖ్యలో ప్రజలు ఆయన అంత్యక్రి యల్లో పాల్గొని కన్నీటి నివాళులర్పించారు.

# గుండె నిండా ధైర్యం

(మొదటి పేజీ తరువాయి)

వృత్తి కార్మికులకు ఏడాదికి 10వేలు... నామినేటెడ్ పదవుల్లో, నామినేషన్ పనుల్లో బడుగు, బలహీన, దళిత, మైనార్టీ వర్గాలకు 50శాతం రిజర్వేషన్లు, విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రణకు చట్టం, ఇసుక, మద్యంపై కొత్త పాలసీలు.... అన్నింటికి మించి రాష్ట్రవ్యాప్తంగా భూములపై సమగ్రంగా రీ సర్వే చేయించి రెవెన్యూ రికార్డులను పటిష్టం చేయడం... కేవలం రెండు నెలల పాలనాకాలంలోనే వై.యస్. జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో పురుడు పోసుకున్న కార్యక్రమాలివి! ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఈ రెండు నెలల్లోనే దాదాపు ముప్పావు భాగం ఆయన అమలులోకి తెచ్చేశాడు.

ఇవే కార్యక్రమాలను మన చంద్రబాబు అమలు చేసుంటే ఆ హంగు ఆర్భాటం వేరే విధంగా వుండేది. ఉదాహరణకు మొదట 'అమ్మఒడి'నే అమలు చేశాడనుకుందాం. పథకాన్ని ప్రకటించే రోజు పెద్ద సభ పెట్టేవాళ్ళు, అన్ని జిల్లాల నుండి స్పెషల్ బస్సులు పెట్టి ఆ సభకు మహిళలను తీసుకెళ్లేవాళ్ళు... కొందరు తెలుగు మహిళా నాయకురాళ్ళు... "జయము జయము చంద్రన్నా... జయము జయమునీకు" అంటూ కొద్దిసేపు భజన చేసేవాళ్ళు, ఆ తర్వాత చంద్రబాబే ఆర్భాటంగా 'అమ్మఒడి' పథకం ప్రకటన... ఆపై జిల్లాల వారీగా 'అమ్మఒడి' పథకంపై అవగాహన సదస్సులు... దీనికోసం జిల్లాకో నాలుగు కోట్లు లెక్కన కేటాయింపు... చంద్రన్న మదిలో పుట్టిన కమ్మని ఆలోచన అమ్మఒడి అంటూ తెలుగుతమ్ముళ్ళు ఒక నెలరోజులపాటు భజన చేసేవాళ్ళు. పసుపు పత్రికలు దీనిని చంద్రబాబు మానసపుత్రికగా ప్రచారం చేసేవి. అమెరికా అధ్యక్షుడు కూడా అక్కడ 'అమ్మఒడి' పథకాన్ని అమలు చేయాలనుకుంటున్నాడన్నట్లు డబ్బా కొట్టేవి. జగన్ రెండు నెలలు అమలులోకి తెచ్చిన కార్యక్రమాలను చంద్రబాబు అయితే పదేళ్లకు కూడా అమలులోకి తేలేడు. ఎందుకంటే ఒకేసారి అన్నీ అమలు చేస్తే ఆ తర్వాత చేయడానికి ఏమీ వుండదని... ప్రజల్లో ప్రచారం ఉండదని.

జగన్ అంత దూరం ఆలోచించలేదు. ప్రజలకు మాటిచ్చాడు కాబట్టి టకటకా ఆచరణలో పెట్టేస్తున్నాడు. అయితే ఇన్ని కార్యక్రమాలను చిత్తశుద్ధిగా అమలు చేయడంలో జగన్ ఎన్నో సవాళ్ళను ఎదుర్కోవాల్సి వుంటుంది. 2004–2009ల మధ్య దివంగత నేత డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి ప్రజలకిచ్చిన హామీలన్నింటిని అమలులోకి తెచ్చి వారి గుండెల్లో దేవుడయ్యాడు. ఆరోజు అదృష్టం కొద్ది కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే వుండింది. కాబట్టే వై.యస్. కావాల్సినన్ని నిధులు తేగలిగాడు. ఈరోజు జగన్‌కు అలాంటి అవకాశం లేదు. అక్కడుండేది బీజేపీ వాళ్ళు. ఏపిలో కూడా పాగా వేయడానికి పాచిక లేస్తున్నారు. జగన్ కోరినట్లు వాళ్ళు నిధులిచ్చే అవకాశం లేదు. రాష్ట్రంలో నిధులు అంత పుష్కలంగా లేవు. ఈ సంక్షేమ కార్యక్రమాలను నిరంతరాయంగా అమలు చేయడం జగన్‌కు పెద్ద సవాలే కానుంది.



## చెంగాళమ్మ గర్భగుడి..

# స్వర్ణ శోభితం

తెలుగు, తమిళ భక్తుల ఇలవేల్పు సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం గర్భగుడి స్వర్ణ శోభితం కానుంది. చెన్నైలోని అలయన్స్ గ్రూప్ ఛైర్మెన్ మనోజ్‌సాయి నంబూరు - లత దంపతులు, నంబూరు లేబొరేటరీస్ అధినేత నంబూరు మోహన్‌రావు - సులోచన దంపతులు తమ ఇష్టదైవమైన చెంగాళమ్మ పరమేశ్వరీ అమ్మవారి గర్భగుడికి తమ సొంత నిధులతో స్వర్ణ కవచం ఏర్పరిచారు. గత కొన్ని నెలలుగా తమిళనాడుకు చెందిన స్వర్ణకారులు గర్భాలయ ఆకృతుల కొలతలు సేకరించారు. దాని ప్రకారం స్వర్ణ తాపడాలు తయారు చేసి గర్భగుడికి అమర్చారు.

అమ్మవారికి ప్రీతిపాత్రమైన తొలి శ్రావణ శుక్రవారం అయిన 2వ తేదీన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ 'గర్భాలయ స్వర్ణకవచం'ను ఆవిష్కరిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 8.30గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు అమ్మవారికి చండీహోమం మరియు పుష్పయాగం నిర్వహిస్తున్నారు.

# డిసిసిబి ఛైర్మెన్‌గా ఆనం విజయ?



- **త్వరలోనే ఉత్తర్వులు**

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డిని నియమించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్మోహన్‌రెడ్డి నిర్ణయించారని తెలిసింది. ఒక ట్రెండురోజుల్లోనే దీనికి సంబంధించి ఉత్తర్వులు వెలువడే అవకాశ ముంది. జిల్లా కేంద్ర సహకార సంఘాలలో గత పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో అన్ని సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే బ్యాంకు అధ్యక్షులను కూడా ప్రభుత్వమే ఎంపిక చేయనుంది. ఈ క్రమంలోనే డిసిసిబి ఛైర్మెన్‌గా ఆనం విజయకుమార్‌రెడ్డి పేరు తెరమీదకొచ్చింది.

ఆనం విజయకుమార్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇస్తామనే హామీ వుంది. 2015లో అందరూ అప్పటి అధికార పార్టీ తెలుగుదేశంలో చేరేటప్పుడు తన రాజకీయ పయనం కోసం ప్రతిపక్ష పార్టీ అయిన వైసిపిని ఎంచుకున్న ఏకైక నాయకుడాయన. తన సోదరులను కూడా ధిక్కరించి వైసిపిలో చేరాడు. రెండేళ్ళ క్రితం అధికార తెలుగుదేశంకు భయపడి నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల శాసన మండలి నియోజకవర్గం నుండి వైసిపి అభ్యర్థిగా పోటీ చేయడానికి ఎవరూ సాహసించని తరుణంలో ధైర్యంగా ముందుకొచ్చి పోటీ చేసి గట్టి పోటీనిచ్చి ఓడిపోయాడు. నిన్నటి ఎన్నికల్లోనూ పార్టీ గెలుపు కోసం తనవంతు కృషి చేశాడు. పార్టీ అధికారంలోకి వస్తే తొలి ఎమ్మెల్సీ ఆయనేననే ప్రచారం వుంది. అయితే ఎమ్మెల్సీ అవకాశాల కోసం ఇంకా రెండేళ్ళు ఆగాల్సి రావడంతో ఈలోపుగా ఆయనకు డిసిసిబి అధ్యక్ష పదవి బాధ్యతలను అప్పగించనున్నారు.

అలాగే జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థ ఛైర్మెన్‌గా కొడవలూరు మాజీ జడ్పీటీసి వీరి చలపతిరావును నియమించనున్నట్లు సమాచారం.

# ఈ విద్యాలయం.. మా దేవాలయం!

## స్వామిదాస్ పూర్వవిద్యార్థుల అనుభూతి



నెల్లూరు, బాలాజీనగర్‌లోని శ్రీ బి.స్వామిదాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 1993-94 బ్యాచ్ పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఇటీవల స్కూల్ ప్రాంగణంలో జరిగింది. ఈ స్కూల్‌లో తాము చదివి పాతికేళ్ళు అయిన సందర్భంగా పూర్వవిద్యార్థులు సిల్వర్‌జూబ్లీ వేడుకలు జరుపుకున్నారు. ఇది విద్యాలయం కాదని తమ భవితను తీర్చిదిద్దిన దేవాలయంగా వారు అభివర్ణించారు. తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసిన ఈ విద్యాలయాన్ని దర్శించడం, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించుకోవడం తమ పూర్వజన్మ సుకృతంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారంతా బి.స్వామిదాస్‌ను, లిల్లీ స్వామిదాస్‌లను స్మరించుకుంటూ నివాళులర్పించారు. పాఠశాల నిర్వాహకులు శారదను, ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులందుకున్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు







## నివాళి



జననం
16.10.1930

మరణం
20.07.2019

పెద్దలు, పూజ్యులు

**శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారి**

మృతికి చింతిస్తూ...

ఆమె ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

**టివియస్ చలపతిరావు**
భారత్ బిల్డర్స్, నెల్లూరు

**టి.ఉదయ్‌కుమార్‌రెడ్డి**
పేడూరు

**డి.శ్రీనివాస్**
స్విట్జర్లాండ్

**జి.శ్రీనివాసులురెడ్డి**
నెల్లూరు

**ఆర్.బాలిరెడ్డి**
నెల్లూరు

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com